J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 3 20.06.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఒక్కొక్కటిగా అమలవుతున్న హామీలు...

# వారంటీ లేని గ్యారంటీలు!




- సూపర్‌సిక్స్ పథకాలపై రాష్ట్రవ్యాప్త చర్చ
- అన్నీ ఇచ్చేశామంటున్న కూటమి ప్రభుత్వం
- లేనేలేదంటున్న ప్రతిపక్షం
- ప్రభుత్వానికి గుదిబండే అంటున్న విశ్లేషకులు

**ఉచితాలన్నీ సముచితాలే అనే అభిప్రాయమున్న నేటి ప్రజాస్వామ్య భారతంలో ఏ పార్టీ అయినా ప్రజలను ఆకట్టుకునేందుకు మొదట పలికే పదం ఫ్రీఫ్రీఫ్రీ. అది బస్సు ప్రయాణమైనా, చదువుపై పెట్టే పెట్టుబడైనా, సాగుకు వెచ్చించే సొమ్ములైనా నాయకుల దృష్టిలో ఒక్కటే. ఎందుకంటే వారికి కావాల్సింది ఓట్లు. అధికారానికి అవసరమైన సీట్లు మాత్రమే కాబట్టి. ఇక ప్రజల విషయానికి వస్తే 'మాకేంటి' అనేవారే ఎక్కువ. ఈ నేపథ్యంలో ఏడాది క్రితం సూపర్ సిక్స్ హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, వాటి అమలుపై ఎంత వీలైతే అంత అనే ధోరణితో ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.**

ఇటీవల 'తల్లికి వందనం' పథకం నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన తర్వాత సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. సూపర్‌సిక్స్‌లో భాగమైన సామాజిక పింఛను, ఉచిత సిలిండర్లు, తల్లికి వందనం పథకాలు అమల్లోకి వచ్చాయని, ఈనెల 20వ తేదీ నుంచి అన్నదాత సుఖీభవ తొలి విడత వాయిదా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని స్పష్టం చేశారు. ఇక మహిళలకు నెలకు రూ.1500లను పీ4 పథకంలో భాగంగా అమలు చేస్తామని, అందుకోసం సమాజంలోని ఉన్నతస్థాయి వర్గాల నుంచి పేదలను అక్కున చేర్చుకునే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో నిరుద్యోగ భృతి, 20లక్షల ఉద్యోగాల కల్పన వంటి పథకాలను స్కిల్ డెవలెప్‌మెంట్‌లో భాగంగా కార్యాచరణలోకి తీసుకొస్తామని ప్రకటించారు. దీంతో సూపర్ సిక్స్ హామీలన్నీ అమలైనట్లేనని, ఇంకా ఎవరైనా సూపర్ సిక్స్‌పై నెగటివ్‌గా మాట్లాడితే వారి నాలుక మందం అనుకోవాల్సిందేనంటూ వాఖ్యానించారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రబాబు మరోసారి ప్రజలకు వెన్నుపోటు పొడిచారంటూ మండిపడగా, ప్రజలు మాత్రం రకరకాలుగా స్పందిస్తున్నారు. ఇక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసిన విశ్లేషకులు, విమర్శకులు మాత్రం సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి కత్తిమీద సామేనని, అందుకే ప్రభుత్వ పెద్దలు చెబుతున్న గ్యారంటీలకు ఎన్నాళ్లు వారంటీ ఉంటుందో చెప్పడం కష్టమంటూ అభిప్రాయపడుతున్నారు.

### అసలు సిసలు సవాళ్లు ఇవే..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రాజధాని అమరావతికి కనీసం రూ.50 వేల కోట్లు అవసరం ఉండడం, పోలవరానికి మరో 30వేల కోట్ల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడడం, సూపర్ సిక్స్ పథకాలకైతే ఏకంగా ఏడాదికే రూ. లక్ష కోట్లకు పైగా ఖర్చువుతుందనే అంచనాలుండడం కూటమి ప్రభుత్వాన్ని కలవరపరుస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రధానమైన సామాజిక పింఛన్లను 65 లక్షల మంది వరకు పొందుతున్నారు. ఇక దాదాపు 90 లక్షల మంది ఉచిత సిలిండర్లు అందుకుంటున్నారు. ఇక సూపర్ సిక్స్‌లో అత్యంత ముఖ్యమైన అంశం తల్లికి వందనం. ఈ పథకం ద్వారా ఎంతమంది బిడ్డలుంటే ఒకొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున పిల్లలను బడికి పంపించే తల్లి ఖాతాలో వేస్తామని మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించారు. దీనిని ఈ ఏడాది జూన్ 12న పట్టాలెక్కించారు. గతంలో 42 లక్షల మంది తల్లుల ఖాతాలో వైఎస్ జగన్ ప్రభుత్వం సంవత్సరానికి రూ.15 వేలు చొప్పున వేసింది. తర్వాత కాలంలో రెండువేలు స్కూల్ మెయింటెనెన్స్ కోసం అంటూ కోత విధించి రూ.13 వేలు చొప్పున అందించింది. అయితే ప్రస్తుతం ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ కోతల్లేకుండా రూ.15 వేలు చొప్పున వేయాల్సి ఉంది. దీంతో లబ్ధిదారుల సంఖ్య 73 లక్షల మంది వరకు ఉంది. వీరిలో 68 లక్షల మందికి ఈ పథకం విజయవంతంగా అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు పూర్తయిన తర్వాత జూలైన 5న మిగిలిన వారి ఖాతాల్లో కూడా నగదు జమ అవుతుందని ప్రకటించింది. అలాగే అన్నదాత సుఖీభవ కింద రాష్ట్రంలోని రైతులందరికీ ఏడాదికి రూ. 20 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాల్లో వేయాల్సి ఉంది. ఇదికూడా కూటమికి గుదిబండ లాంటిదే అని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక రాష్ట్రంలోని 1.54కోట్ల మంది రేషన్ కార్డులున్న మహిళల ఖాతాల్లో నెలకు ఆడబిడ్డ నిధి పథకంలో భాగంగా ప్రతినెలా రూ.1,500 జమచేయాల్సి ఉంది. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, 40 లక్షల మంది నిరుద్యోగులకు ప్రతినెలా రూ. 3వేలు నిరుద్యోగ భృతి అందించాల్సి ఉంది. అయితే స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఈ రెండు పథకాలు ఆటోమేటిక్‌గా అమలు చేస్తామని చంద్రబాబు చెబుతున్నారు. అలాగే తొలి సంతకం అన్న ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీకి సంబంధించి ప్రస్తుతం పరీక్షలు నిర్వహిస్తున్నామని, తద్వారా 16 వేల పోస్టులను భర్తీ చేస్తున్నామని పేర్కొంటున్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేస్తామని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ కానుకలో భాగంగా మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అయితే సూపర్ సిక్స్ పథకాలన్నింటికీ ఎంతలేదన్నా రూ. లక్ష కోట్లకు పైగానే ఖర్చువుతుందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తం రూ. 3 లక్షల కోట్లకు అటూఇటూగా బడ్జెట్ ఉన్న నేపథ్యంలో ఏటా రూ. లక్ష కోట్లకు పైగా సంక్షేమ పథకాలకు వెచ్చించడం కుదరని పని అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక పోలవరం, అమరావతి ఎలాగూ ఉన్నాయి. వీటికితోడు రాష్ట్రం చెల్లించాల్సిన అప్పులు, వాటికి కట్టాల్సిన వడ్డీలు, ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు తడిసి మోపెడవుతాయనడంలో సందేహం లేదని నొక్కి వక్కాణిస్తున్నారు.

### ఇతర హామీల మాటేమిటి..?

అసలు పథకాలైన సూపర్ సిక్స్‌కే.. లెక్కకుమిక్కిలి అడ్డంకులుంటే మరి కొసరు పథకాల సంగతేమిటనే వాదనలు వినిపిస్తున్నాయి. డ్వాక్రా మహిళలకు రూ. 3 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఉద్యోగాలు చేసే మహిళలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో హాస్టల్ వసతి, పీ4 మోడల్, కళలకు రెక్కలు పథకం ద్వారా విద్యార్థులకు రుణాలు, పండుగ కానుకలు, పెళ్లి కానుకలు, వంటి హామీల అమలు ఏమౌతుందే అనే అంశం చర్చనీయాంశంగా మారింది.

2లో




# ఆరోగ్య 'యోగ'ం

## విశాఖలో యోగా డేకి సర్వం సిద్ధం

## రాష్ట్రానికి రానున్న ప్రధాని మోదీ

**యోగాంధ్రకు వేళైంది.. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ వేదిక కానుంది. ఈనెల 21న ప్రధాని మోదీ యోగా డేలో పాల్గొననున్నారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా యోగా విశిష్టతను తెలియజేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు బీచ్ రోడ్లో 5 లక్షల మంది యోగాసనాలు వేయనున్నారు. కాగా యోగా డే రోజు ఆసనాలు వేయడానికి రెండున్నర కోట్ల వరకు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. యోగాకు సంబంధించి విశాఖ డిక్లరేషన్‌ను కూడా ప్రకటిస్తామన్నారు. లక్ష ప్రదేశాల్లో ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.**

సౌండ్ మైండ్ ఇన్ ఏ సౌండ్ బాడీ (ఆరోగ్యవంతమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన ఆలోచనలు వస్తాయి) శాస్త్రీయంగా కూడా నిరూపితమైన ఈ సామెతను నిజం చేసే వజ్రాయుధం యోగ. భారతీయ జీవిత విధానంలోనే యోగా అంతర్లీనంగా కలిసిపోయిందంటే అతిశయోక్తి కాదేమో. ఏకగ్రతతో మనస్సును శ్వాసపై లగ్నం చేసి ఆలోచనలను నియంత్రించే గొప్ప శక్తి యోగాకు ఉంది. నిజానికి ఆరోగ్యయోగం అనేది భారతీయులు చేసే ప్రతి పనిలోనూ, తీసుకునే ఆహారంలోనూ మిళితమైంది. ముగ్గు వేసేటప్పుడు, వంట వండేటప్పుడు, కాయగూరలు తరిగేటప్పుడు, బావిలో నీరు తోడేటప్పుడు, వ్యవసాయ పనులు, భవన నిర్మాణ పనుల్లో భాగంగా చేసే కృత్యాలు శరీర సౌష్టవాన్ని పెంపొందించే

2లో



# డా. గంగిశెట్టి శివకుమార్‌కి..
# కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు




• 'కబుర్ల దేవత'కి బాలసాహిత్య పురస్కారం

నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత – బాలసాహితీవేత్త డా.గంగిశెట్టి శివ కుమార్ ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య అవార్డుకి ఎంపి కయ్యారు. సాహిత్యరంగంలో సుప్రసిద్ధు లైన పలువురు జ్యూరీ సభ్యులుగా వ్యవహ రించి, 24 భారతీయ భాషల్లో బాల సాహిత్యం, 23 భారతీయ భాషల్లో యువ సాహిత్య పురస్కారాలకు ఎంపిక చేశారు. అందులో తెలుగుభాషకు సంబంధించి బాలసాహిత్యంలో డా. గంగిశెట్టి రచించిన 'కబుర్ల దేవత' పుస్తకానికి ఆ అవార్డు లభించడం విశేషం. కేంద్ర సాహిత్య అకాడమీ వారు త్వరలో ఢిల్లీలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారాల కింద సన్మానం, జ్ఞాపికతో పాటు 50 వేల రూపాయలను కూడా రచయితకు బహుమతిగా ఇవ్వనున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, బాలలకు నీతికథలు బోధించి చైతన్యవంతం చేయాలనే తప నతో డా. గంగిశెట్టి ఎంతోకాలంగా బాలల కథలు రాస్తున్నారు. బాలల కథలపై పరిశోధన చేసి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ను అందు కున్నారు. బాలసాహిత్యానికి సంబంధించి 40 పరిశోధనా పత్రాలు సమర్పించారు. 'చందమామ' పత్రికలో ఉప సంపాద కునిగా కూడా పనిచేశారు. ఆయన రాసిన పలు కథలు ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో ప్రాథమిక విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యా యునిగా అవార్డునందుకున్న డా.గంగిశెట్టి, దాదాపు 58 ఏళ్ళుగా బాలసాహితీ రంగం లోనూ లబ్ధప్రతిష్టులయ్యారు. వందలాది కథలు రాశారు. పలు ప్రముఖ పత్రికల్లో ఆయన బాలల కథలు నేటికీ ప్రచురితమవు తూనే ఉన్నాయి. బాల సాహిత్యంలో తన దంటూ విశేషమైన కృషితో ఎన్నో అవా ర్డులు, పురస్కారాలు అందుకున్నారు. నెల్లూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షునిగా కూడా సేవలంది స్తున్నారు. ఆయన కథలపై పరిశోధనలు చేసి, ఎస్వీ యూనివర్శిటీనుంచి ఇద్దరు పీహెచ్‌డీలు కూడా పొందారు. డా. గంగిశెట్టి శివకుమార్‌కి కేంద్రసాహిత్య అకాడమీ నుంచి బాలసాహిత్య పురస్కారం ప్రకటించడం పట్ల జిల్లాలోని సాహితీ వేత్తలు, బాలసాహిత్యాభిమానులు ఆయ నకు శుభాకాంక్షలు తెలిపారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి దాతల వితరణ





నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి దాతలు దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి ఈనెల 17న లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. రేడియో థెరపీ విభాగంలో లిఫ్ట్ ఏర్పాటుకు ఆ విరాళాన్ని రెడ్‌క్రాస్ కమిటీ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డికి ఇచ్చారు. అదేవిధంగా ఈనెల 18న మరో దాత గంగా కన్యాకుమారి కూడా లక్ష రూపాయలు తమ వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్ జైన్, క్యాన్సర్ ఆసుపత్రి కో–కన్వీనర్ కమలేష్ జైన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మి, రేడియేషన్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ గీత ఉప్పత్రి, జనరల్ మేనేజర్ ఐ.భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 22న..క్రికెట్ జట్టు ఎంపిక

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్–16 బాలుర జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రాజశేఖరరెడ్డి, కె.శ్రీనివాసులు ఈనెల 18న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు 2009 సెప్టెంబరు 1 తర్వాత జన్మించి ఉండాలని, సొంత క్రికెట్ కిట్, వైట్ డ్రెస్‌తో పాటు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని వారు సూచించారు.

## వారంటీ లేని గ్యారంటీలు!

(మొదటిపేజీ తరువాయి)

### చంద్రబాబుది పచ్చిమోసమంటున్న జగన్..

గతంలో నవరత్నాల పథకాల ద్వారా రూ.53 వేల కోట్ల మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా సంక్షేమానికి వెచ్చించింది. అయితే చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు గతంతో కలిపి మరో రూ.73 వేల కోట్ల వరకు అదనంగా ఖర్చువు తుందని అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తేల్చిచెప్పారు. అంటే మొత్తం రూ.1.26 లక్షల కోట్లను సంక్షేమ పథకాల కోసమే వెచ్చించే పరిస్థితిలో రాష్ట్రం లేదని, వీటి అమలు సాధ్యం కాదని విమర్శించారు. మరోసారి అదే విషయాన్ని తాజాగా వెల్లడించారు. మోసగించేందుకే సూపర్ సిక్స్ పథకాలు అమలైపోయాయంటూ చంద్రబాబు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈనేపథ్యంలో సంపద సృష్టి ఎంతవరకు వచ్చింది. సూపర్ సిక్స్ పథకాల అమలుపై బహిరంగ చర్చకు రావాలని వైఎస్సార్ సీపీ నాయకులు కూడా సవాల్ విసురుతున్నారు. ఇలా అధికార ప్రతిపక్షాలు కత్తులు దూసుకుంటున్న సమయంలో ప్రజల్లో మాత్రం అబ్బా, అబ్బో, అబ్బే అనేలా చర్చలు జోరందుకోవడం గమనార్హం. ఇక ప్రజాభిప్రాయం పూర్తిస్థాయిలో తెలియాలంటే మాత్రం వచ్చే ఏడాది జరుగుతాయని భావిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఆగాల్సి ఉంటుందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఏదేమైనా 10 లక్షల కోట్ల అప్పులున్న ఆంధ్రాకు సంక్షేమ పథకాల అమలు ముందరి కాళ్లకు బంధం అనడంలో సందేహం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం అత్యుత్సాహంతో ప్రకటించే ఏ గ్యారెంటీకి వారెంటీ లేదని తేల్చేస్తున్నారు..!

## 25 నుంచి..
## ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరులోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవాలయంలో ఈనెల 25 నుంచి పెద్దఎత్తున బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. జులై 15 వరకు జరిగే ఈ ఉత్సవాల్లో వేలసంఖ్యలో భక్తులు పాల్గొంటారు కనుక, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు–జిల్లా అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు సంబం ధించిన గోడపత్రాలను ఈనెల 18న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ అనూష, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మునిసిపాలిటీ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల..రక్తదానం



నెల్లూరులోని వెంక ట్రామాపురం ఏపీ గ్రామీణ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో ఈనెల 18న రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ప్రభుత్వాసుపత్రి వైద్యుల సూచనల మేరకు నిర్వహించిన ఈ శిబిరాన్ని ఆ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ టి.మోహన్‌రెడ్డి ప్రారంభిం చారు. బ్యాంకు ఉద్యోగులు, ప్రభుత్వాసుపత్రి రక్తనిధి సిబ్బంది రక్తదానం చేశారు.

## ఆరోగ్య 'యోగ'ం

(మొదటిపేజీ తరువాయి)

ఆసనాలని తలపిస్తుంటాయని పెద్దలు చెబు తుంటారు. సూర్యనమస్కారాలు, ప్రాణా యామంతో మొదలుపెట్టి, వేసే ఆసనాలన్నీ ఆరోగ్య పరిరక్షణకు దోహదపడి మేధా శక్తిని ఎంతగానో పెంపొందిస్తాయనడంలో సందేహం లేదు.

### మన ఆరోగ్యం మన చేతుల్లోనే....

ప్రపంచమే ఓ కుగ్రామం అయిన నేటి కాలంలో రెప్పపాటులో చోటు చేసుకునే సంఘటనలెన్నో. వీటిలో మనిషికి చేటు చేస్తున్న ఘటనలు మరెన్నో. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి అర్ధరాత్రి వరకు కాలంతో పోటీపడి బ్రతుకు పోరాటం కోసం పరిగెత్తే మానవుడికి. ప్రస్తుతం ఆరోగ్యసిరి ఎంతైనా అవసరమంటున్నారు వైద్య నిపుణులు. జీవితాభివృద్ధికి సంబం ధించిన ఆలోచనలను వదిలిపెట్టి, వ్యస నాలకు విడాకులిచ్చి, ఆఫీస్ ఫైళ్లకు తాళం వేసి, కుటుంబ సమస్యలను పక్కనపెట్టి కనీసం రోజులో గంటపాటైనా మన ఆరోగ్యం, మన ఆయుష్షు, మనో తేజస్సుపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. అప్పుడే మన భవిష్యత్ భద్రంగా నాలుగు కాలాల పాటూ ఆరోగ్యంగా ఉంటుందనడంలో సందేహం లేదని తేల్చి చెప్తున్నారు. రోజువారి కార్యకలాపాల్లో చిన్నపాటి మార్పులు చేసుకోవడం వల్ల మనిషి ఆయుర్దాయాన్ని మరింత పెంచుకోవచ్చని, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని అంటున్నారు. ఇందుకోసం యోగా ఓ గొప్ప వరమని సూచిస్తున్నారు.

### వ్యాయామం ఓ భాగం కావాల్సిందే..

ఎంతపెద్ద గడ్డ అయినా కత్తిమీటకు లొంగకపోవచ్చునట్లు, ఎంతటి ఆరోగ్య సమస్య అయినా వ్యాయామంతో దారికొస్తుందనం దంలో సందేహం లేదు. రోజూ క్రమం తప్పని వ్యాయామం వల్ల రక్తప్రసరణ సక్రమంగా జరగడం, అజీర్తి సమస్యలు లేకుండా మలబద్ధకానికి చెక్ చెప్పడం, స్థూలకాయాన్ని ఇట్టే కరిగించడం, ముఖ వర్చస్సును పెంచడం, నిస్సత్తువను నీరు గారేలా చేయడం సులభతరమవుతుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్‌ని బయటకు పంపించి శరీరాన్ని బలిష్టం చేయడంలో వర్కౌట్లను మించిన సాధనం లేదని క్రీడా నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. అలాగే ప్రాచీనకాలం నుంచి భారతీయ తకు చిహ్నంగా ఉన్న యోగాసనాలకు కూడా ప్రజలు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచిస్తున్నారు. యోగా వల్ల మనిషి మాన సిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఒత్తిడిని తట్టుకునే గుణాన్ని పెంపొందిస్తుందని చెప్తున్నారు. ఇక సుఖవంతమైన నిద్ర కూడా ఆరోగ్యాన్ని వ్యాధుల బారిన పడ కుండా రక్షిస్తుందని, ఆయుష్షును పెంచు తుందని సూచిస్తున్నారు. అలాగే పొగ తాగడం, మద్యపానం వంటి వ్యసనాలకు చెక్ చెప్పడమంటే, రోగాలకు చెక్ చెప్పడం అనే విషయాన్ని గుర్తించుకోవాలని సూచిస్తున్నారు.

### పర్యావరణంతో యుద్ధం ఆపాలి..

రోజూ క్రమం తప్పని యోగాసనాలతో పాటు సమాజపరంగానూ మనిషిలో ఎంతో పరిణితి రావాల్సి ఉంది. అప్పుడే ప్రజారోగ్యం సురక్షితంగా ఉంటుంది. ఎందుకంటే వ్యక్తిగతంగా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, తాగే నీరు, పీల్చేగాలి, నడిచే నేల కలుషితమైతే మనిషి ఆరోగ్యం అగమ్య గోచరం అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. దీనికి ఉదాహరణ మన దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత సంప న్నులు ఎందరో ఉన్నా వారంతా ఇళ్ల నుంచి బయటకు వచ్చే చల్లటి గాలి పీల్చు కుని ప్రకృతిని ఆస్వాదించే అవకాశం లేకుండా పోతోంది. దీనికి కారణం ఢిల్లీలో గాలి కాలుష్యం మోతాదుకు మించి ఉండడంతో కొన్నిసార్లు స్కూళ్లకు కూడా సెలవులివ్వాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇక అనేక నగరాలు, పట్టణాల్లో మురుగు నీరు, పారిశుధ్య సమస్యల కారణంగా చాలా చోట్ల తాగునీరు కలుషితమవు తోంది. తాగునీటి పైప్‌లైన్లు మురుగు కాలువలగుండానే వెళ్తున్నాయి. ఫలితంగా ప్రజలు అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరిగే పరిస్థితి నెలకొంటోంది. అందుకే పర్యావరణవేత్తలు, ఆహార నిపు ణులు ప్రతి ఒక్కరూ పచ్చనిచెట్ల పెంపకా నికి తొలి ప్రాధాన్యమివ్వాలని, అభివృద్ధి పేరుతో పరిశ్రమలకు అనుమతులిచ్చే సందర్భాల్లోనూ ప్రభుత్వాలు పర్యావరణ నిబంధలను తప్పక అమలుచేయాలని సూచిస్తున్నారు. తద్వారా పచ్చదనం పెరగడంతో పాటు గాలిలో స్వచ్ఛత, సకాలంలో వర్షాలు కురవడం వల్ల భూమిలో నీటి లభ్యత పెరుగుతుందని స్పష్టం చేస్తున్నారు. ఇక భూ కాలుష్య నివారణ కోసం ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేయాలని, సహజసిద్ధమైన పదార్థాలకు, వస్తువులకే తొలిప్రాధాన్యమివ్వాలని సూచి స్తున్నారు. తద్వారా మనిషికి పర్యావరణం ఓ యుద్ధం కాకుండా ఉంటుందని చెబు తున్నారు. పర్యావరణ హితమైన చర్యల వల్ల మనిషి సగటు జీవితకాలం కూడా మెరుగువుతుందని తేల్చి చెప్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో 'యోగా'. ఒక్కటే సర్వరోగ నివారణమని మేధావులు సూచి స్తున్నారు. "రండి... యోగా చేద్దాం ఆరోగ్య భారతాన్ని స్థాపిద్దాం" అని పిలుపు నిస్తున్నారు..!

## మంత్రి ఆనం ఆదేశాలతో..

# రోడ్డు ప్రమాదాల నివారణకు కదిలిన అధికారులు





ఆత్మకూరు నియోజకవర్గంలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించడంతో, సంబంధిత అధికారులు వెంటనే స్పందించారు. మంత్రి సూచనల మేరకు, ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఎన్ హెచ్ 67 రహదారిపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలంటూ, మంత్రి ఆనం ఇటీవల నేషనల్ హైవే అథారిటీ అధికారులకు లేఖ రాయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జాతీయ రహదారి-67 (హుబ్లి-కృష్ణపట్నం రోడ్) లోని కీలకమైన జంక్షన్- 693 కిలోమీటరు వద్ద "0" కిలోమీటరు వద్ద రాష్ట్ర రహదారి 335 (ఆత్మకూర్-హసనాపురం రోడ్)తో కలుస్తున్న ప్రాంతంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మంత్రి ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఎన్‌హెచ్-67 రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు ప్రారంభించారు. ఈనెల 18న నేషనల్ హైవే అథారిటీ, పోలీసు, రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులు సంయుక్తంగా ఆ రహదారిని పరిశీలించారు. ఇటీవల జరిగిన ప్రమాదాల తీరుతెన్నులను విశ్లేషించారు. ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేపీ చౌదరి మాట్లాడుతూ, మంత్రి సూచనల మేరకు ఈ రహదారిని పరిశీలించినట్లు చెప్పారు. మితిమీరిన వేగం, ఓవర్‌లోడ్ కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని నిర్ధారించినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో వాహనదారులకు అతి వేగం, అధిక లోడ్ నివారించేలా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన సూచిక బోర్డులు, రహదారిపై పెయింటింగ్ ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆత్మకూరు ఆర్డీవో పావని, ఆర్&బి ఎస్‌ఈ గంగాధర్, జిల్లా రవాణాశాఖ అధికారి చందర్, పంచాయతీరాజ్ ఇఇ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రూరల్‌లో 'చంద్రన్న పార్కుల బాట'

## ఒక్కరోజే 14 పార్కులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో 'చంద్రన్న పార్కుల బాట' కార్యక్రమం ఇటీవల విజయవంతంగా ప్రారంభమైంది. రూరల్‌లో ఒకేరోజున ఆయన 14 పార్కులకు శంకుస్థాపన చేయడం విశేషం. మొత్తంగా తమ నియోజకవర్గంలో 29 పార్కుల అభివృద్ధికి 7 కోట్ల రూపాయలు విడుదలయ్యాయని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. తమ నియోజకవర్గ పరిధిలోని 18, 19 మరియు 20 డివిజన్‌లో 14 పార్కులకు స్థానిక ప్రజలతో కలసి ఆయన శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నెల 19, గురువారం స్థానిక ప్రజలతో కలిసి 21, 22, 23 డివిజన్‌లలో పార్కుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 150 కోట్లు విలువ చేసే పార్కు స్థలాలను కబ్జాదారులకు చెందకుండా చేశామని, కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. రూరల్‌లో కబ్జాదారుల ఆటలు సాగవన్నారు. ప్రజల ఆస్తిని, ప్రభుత్వ ఆస్తిని కాపాడాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఇప్పుడేమీ ఎన్నికలు లేవని, ఈ సమయంలో రాజకీయపార్టీలకు అతీతంగా అందరం కలసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుదామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో ప్రజల ఆశీస్సులతో నెల్లూరు రూరల్‌లో ఎన్నోరకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# ఆకట్టుకుంటున్న.. 'పెట్రా స్టీల్ డోర్స్-విండోస్'




నెల్లూరు మాగుంట లే-అవుట్‌లో ఈనెల 16న 'పెట్రా స్టీల్ డోర్ అండ్ విండోస్' ప్రారంభమైంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ఈ షోరూంకు ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అభినందించారు. 'పెట్రా' షోరూమ్ అధినేత కలీమ్ మాట్లాడుతూ, తమవద్ద అత్యంత నాణ్యమైన స్టీల్ డోర్‌లు, విండోలు తక్కువ ధరలకే లభిస్తాయన్నారు. కొచ్చి పెట్రా కంపెనీ నుంచి వాటిని దిగుమతి చేసుకుని, ఇక్కడి ప్రజలకు సరసమైన ధరలకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రెండవ బ్రాంచ్‌గా నెల్లూరులో ఈ షోరూంను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇంకా హిమాచలప్రదేశ్, విశాఖపట్టణం, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరుల్లో కూడా బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అరవ శీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం, అతిథులకు నిర్వాహకులు జ్ఞాపికలను బహుకరించారు. స్టీలు డోర్లు, కిటికీలు కావాలనుకున్న వారిని ఇవెంతగానో ఆకట్టుకుంటున్నాయి.

# జయభారత్ ఆసుపత్రికి..2 లక్షల విరాళం



నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో పేదలకు జరుగుతున్న ఉచిత కంటి చికిత్సలకు ఆసరాగా ఈ నెల 18న రెండు లక్షల రూపాయల విరాళం అందింది. దాత బెజవాడ శ్రీ కృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా, ఆయన తమ తల్లితండ్రుల జ్ఞాపకార్థం ఈ విరాళం అందించారు. తమ తల్లితండ్రులు రామచంద్రారెడ్డి-బుజ్జమ్మల జ్ఞాపకార్థం ఈ విరాళం ఇచ్చారు. ఆసుపత్రిలో ఉచిత కంటి శస్త్రచికిత్సల కోసం ఈ విరాళాన్ని ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఛైర్మెన్ పొన్నవోలు సీతారామిరెడ్డి మాట్లాడుతూ, ఈ విరాళంతో వందమంది పేదలకు కంటి శస్త్రచికిత్సలు చేయిస్తామని, బుధవారం కొంతమందికి ఆపరేషన్లు చేయించామని తెలిపారు.

లాయర్
జూన్ 20, 2025

# ముంచుకొస్తోన్న..'చెత్త' ముప్పు!

మనం తేలిగ్గా తీసి పారేసే చెత్తే.. మనకు ప్రమాదకరంగా తయారవుతోందా?..అది పెరిగి పెరిగి ఒక పెద్ద ముప్పుగా పరిణమిస్తుందా?.అంటే, అవుననే అంటున్నారు నిపుణులు. చెత్తే కదా..అది మనల్ని ఏం చేస్తుందని అనుకోకండి. చెత్త ద్వారా వస్తున్న వ్యాధులతో, కాలుష్యంతో ఏటా మన దేశంలో లక్షలాది మంది జనం ప్రాణాలు కోల్పోతున్నారంటే అతిశయోక్తేమీ కాదు. దేశంలో ఏటా కనీసం 5 కోట్ల టన్నుల దాకా చెత్త పేరుకుపోతోందని, అది ఎప్పటికప్పుడు పెరిగిపోతూనే ఉంది తప్ప తరగడమే లేదని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వచ్చే అయిదేళ్ళలో ఆ చెత్త కనీసం 12 కోట్ల టన్నుల దాకా చేరిపోతుందని కూడా అంచనా వేస్తున్నారు. గ్రామాల నుంచి పట్టణాలకు, నగరాలకు ప్రజలు భారీసంఖ్యలో వలసలు వస్తుండడంతో, పెరిగిపోతున్న నగరజనాభా వల్ల కూడా ఆయా ప్రాంతాల్లో విపరీతంగా చెత్త పేరుకుపోతోంది. చెత్తను పరిశుభ్రం చేయడమన్నది దేశానికో పెద్ద సవాలుగా ఉంటోంది. దేశంలోని అనేక ప్రాంతాల్లోని వీధులు చెత్తకుప్పల్లా ఉంటున్నాయే తప్ప, పరిశుభ్రతే అన్నది కనిపించడం లేదు. రోజా పల్లెల్లో, పట్టణాలు, నగరాల్లో వచ్చి పడే చెత్త అంతా ఇంతా కాదు. ఎంత తొలగిస్తుంటే, అంతకు రెండింతలు, మూడింతలుగా వచ్చి పడుతూనే ఉంది. ఏ కాలువలో చూసినా, ఏ నదిలో చూసినా, ఇంటి చుట్టుపక్కలా, వీధుల్లోనూ ఇలా.. ఎక్కడ చూసినా 'చెత్తే సర్వాంతర్యామి'గా దర్శనమిస్తూనే ఉంటుంది. మనం తినే ఆహారపదార్థాలను, వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో వేసి పారేయడంతో, అవి కుళ్ళిపోయి దుర్వాసన రావడం, ఈగలు దోమలు ప్రబలిపోవడం, వాటి ద్వారా లేనిపోని రోగాలు వ్యాపించడం అందరికీ తెలిసిందే. ఆ చెత్త వల్ల, మురుగు వల్ల దోమలు కుప్పలుతెప్పలుగా పెరగడంతో, ప్రాణాంతకమైన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు కూడా ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. అంతేకాదు, ఆ చెత్తతో పాటు ప్లాస్టిక్ కవర్లను కూడా పశువులు తినడం వల్ల అవి అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోతున్నాయి. వీధులు, ఊళ్ళు, నగరాలు అన్నీ చెత్తతో గబ్బుకొట్టిపోతున్నాయి. ఫలితంగా కాలుష్యం పెరిగి చివరికి పర్యావరణం కూడా దెబ్బతింటోంది. పరిసరాలు కలుషితమై.. గాలి, నీరు, తినే ఆహారం అన్నీ ఒకదాని వెంట మరొకటిగా కాలుష్యం బారినపడుతున్నాయి. ఇటు ప్రజారోగ్యాన్ని, అటు పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న కోట్లాది టన్నుల చెత్తను ఏం చేయాలి? అన్నది ఓ కొరుకుడు పడని పెద్ద ప్రశ్నగా మారుతోంది. మనదేశంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం వల్ల అక్కడక్కడా కొంతమేరకు చెత్త తగ్గి, పరిశుభ్రత కనిపించినా, అదొక నిరంతర ప్రక్రియగా ఉంటేనే పరిసరాలకు, ప్రజలకు మేలు కలుగుతుంది. అందువల్ల దీనిని నిరంతరం పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే, దేశంలో సుమారు 77శాతం వ్యర్థాలను పట్టణాలు, నగరాల్లో బహిరంగంగానే చెత్తకుప్పల్లో వేస్తున్నారని, అందువల్ల మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయని కూడా వారంటున్నారు. దేశంలోని అనేకప్రాంతాల్లో తడి చెత్తను, పొడి చెత్తను ఊరికి దూరంగా వేలటన్నుల్లో పారబోస్తున్నారని, కొంతమంది చెత్తను ఎక్కడంటే అక్కడ కాల్చివేస్తున్నారని, అందువల్ల గాలి కూడా కలుషితమై మళ్లీ అది ప్రజారోగ్యానికి సమస్యలు తెస్తుందని, కనుక చెత్తతో తమాషాలు తగదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, రానురాను అలివిగాని సమస్యగా తయారవుతున్న ఈ చెత్త సమస్యను పరిష్కరించేందుకు కూడా మంచి మార్గాలు ఉన్నాయి, కానీ మన ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో వాటిపై దృష్టి పెట్టడంలేదు. ప్రతి ఊరిలోనూ చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు క్రమబద్ధమైన చర్యలు చేపట్టాలి. ప్రజలకు చెత్త పారవేయడంపై, తడి చెత్తను-పొడి చెత్తను వేరుచేయడంపై అవగాహన కలిగించాలి. చెత్తను డంపింగ్ చేసేందుకు సరైన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలి. చెత్తను రీసైక్లింగ్ చేయడం వల్ల ఉపయోగం ఉంటుంది. చెత్త ద్వారా విద్యుత్‌ను, బయో గ్యాస్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చు. అనేక దేశాల్లో చెత్త నిర్వహణ ఎంతో సమర్థవంతంగా ఉంటుంది. ఆ విధానాలను అధ్యయనం చేయాలి. ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా ఈ చెత్త విషయంలో అప్రమత్తంగా ఉండాలి. మనం పారేసే చెత్తే, మన నెత్తికి ప్రమాదమై చుట్టుకోకుండా ఏం చేయగలమో ఆలోచించాలి. మన చుట్టూ చెత్త లేకుండా చూసుకోవడం ఒక సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలి. ఎక్కడికక్కడ చెత్తను శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రత అనేది..మన జీవన విధానం కావాలి..అప్పుడే, కొంతలో కొంతైనా ఈ చెత్త సమస్యలు తగ్గిపోయేందుకు అవకాశం ఉంటుంది.

# సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 95

## నోరు మంచిదైతే.. ఊరు మంచిది

'నోరు మంచిదైతే.. ఊరు మంచిదవుతుందని పెద్దలు ఊరకే అనలేదు. ఇప్పుడేమైందో చూశావా'.. అనడానికి ఇప్పుడు మన సమాజంలో బోలెడన్ని ఉదాహరణలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి. అయినా, అది ఫలానా వాళ్ళ గురించి అని ప్రత్యేకించి చెప్పాల్సిన సందర్భం ఇది కాదు. ఎప్పుడు ఏది చెప్పాలో, ఎలా చెప్పాలో తెలుసుకుని ప్రవర్తించడమే వివేకవంతుల లక్షణమని విజ్ఞులు, అనుభవజ్ఞులు చెప్తుంటారు. నూటికి నూరుపాళ్ళు అది వాస్తవం. మన 'సత్యపీఠం' శీర్షికలో.. 'నిజాలే మాట్లాడుకుందాం' అనేది కూడా అందుకే.

మాటల్లో, చేతల్లో, రాతల్లో దేంట్లో అయినా సరే, వాస్తవాలుండాలి. ఏది మంచో అదే మాట్లాడాలి. మాట్లాడే మాటల్లో నిజాలు ఉండాలి. మన మాటలు సమాజాన్ని మేల్కొలపాలి, మేలుబాటలో నడిపించాలి. అంతేతప్ప, నాలుక వుంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే, నాలుక బాగానే ఉంటుంది. కానీ, పళ్ళకే ప్రమాదం వస్తుంది. 'చెప్పుడు మాటలు వినడం.. తప్పుడు మాటలు చెప్పడం మంచిది కాదు'. అందులోనూ నేటి అధునాతన కాలంలో, మనం మాట్లాడే మాటలు క్షణాల్లో లోకమంతా కోడై కూసే కాదు..కాదు 'కాలై కూసే' సాంకేతికత వచ్చేసిన నేటి 'సెల్‌ఫోన్ల కాలం'లో ఇంకా జాగ్రత్తగా మాట్లాడాలి. దృశ్య-ప్రసార మాధ్యమాల్లో కానీ, ఇంట్లోకానీ, బయట కానీ, సభల్లో కానీ, సమావేశాల్లో కానీ.. ఎక్కడైనా సరే, ఎవరైనా సరే, ఆలోచించి, ఆచితూచి మాట్లాడాలి. అసభ్య ప్రేలాపనలు పేలడం, బూతులు వల్లించడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం ఘోరమే కాదు.. నేరం కూడా. భావ స్వాతంత్ర్యం ఉంది కదా అని నోటికొచ్చినట్లు మాట్లాడితే ఆ తర్వాత పరిణామాలు మన చేతుల్లో ఉండవు. ఒక్కమాటలో చెప్పాలంటే.. వాళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. అలా మాట్లాడలేనప్పుడు, "మౌనేన కలహం నాస్తి" అన్నట్లుగా అసలు మాట్లాడడమే మానుకోవాలన్నది నేటి మాటలరాయుళ్ళకి ఉత్తమోత్తమం.

### మాటే మనిషికి అసలైన అలంకారం

మాటే మనిషికి నిజమైన అలంకారమని మన పూర్వీకులు ఎప్పుడో చెప్పారు. వాక్కు అన్నది ఆ భగవంతుడిచ్చిన వరం. 'వాగ్భూషణమే.. సుభూషణం' అన్నారు మహాకవి భర్తృహరి. ఈ సృష్టిలో కోటానుకోట్ల జీవరాశులున్నా మాట్లాడే గుణం, మనసారా నవ్వే నైజం ఒక్క మనిషికి మాత్రమే లభించిన వరం. అందుకే 'వాక్కు'కూడా పరమాత్మ స్వరూపం అన్నారు పెద్దలు. దాన్ని సద్వినియోగం చేసుకోవాలే తప్ప దుర్వినియోగం చేయకూడదు. 'తాను ఏం మాట్లాడో తెలిసిన వాడు తెలివిగలవాడు. ఏం మాట్లాడకూడదో తెలిసినవాడు వివేకవంతుడు'..అన్నారు స్వామీ వివేకానంద. ఇవన్నీ ఎంతో విజ్ఞానంతో వివేకంతో పెద్దలు చెప్పే మాటలు. మాట్లాడడంలో కూడా చాలా రకాలున్నాయని, 'మితభాషణం, హితభాషణం, స్మితభాషణం, ప్రియభాషణం, సత్యభాషణం' వంటివెన్నిటినో ఉదాహరణగా మన శాస్త్రాలు చెప్తున్నాయి. అయినా, రానురాను అలాంటి మంచిమాటలను పట్టించుకునేవారు కరువవుతున్నారు. గతంలో, ఎవరితో ఎలా నడుచుకోవాలో, ఎలా మాట్లాడాలో చిన్నతనం నుంచి తల్లితండ్రులు ఎప్పటికప్పుడు పిల్లలకు నేర్పేవారు. ఇప్పుడున్న కాలంలో కొంతమంది పెద్దలకే ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియడం లేదు. మేం మహాజ్ఞానులం అని గొప్పలు చెప్పుకుంటున్న చాలా మందికి కనీసం మర్యాదగా మాట్లాడాలన్న ఇంగితజ్ఞానమే ఉండడం లేదు. మాటల్లో హాస్యం ఉండొచ్చు కానీ, మితిమీరిన వెటకారం ఉండకూడదు. మన మాటలు ఎవరినీ వేధించకూడదు, బాధించకూడదు. విమర్శలు చేయొచ్చు కానీ, అవి సద్విమర్శలుగా ఉండాలే తప్ప కువిమర్శలు కాకూడదు. నిజాలను మసిబూసి మారేడుకాయ చేయడం, లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లూ దుష్ప్రచారాలు చేయడం మంచిది కాదు.

### మాటలు.. మంటలు కాకూడదు!

కొందరి మాటలు, గుండెకి గుచ్చుకున్నట్లుగా ఉంటాయి. చిన్నవాళ్ళు కన్నవాళ్ళని గురించి మాట్లాడేటప్పుడు కఠినపదజాలం వాడినా సరే, ఆ తల్లితండ్రులు జీవితాంతం ఆ మాటల్నే గుర్తుపెట్టుకుని బాధపడిపోతుంటారు. ఇక సమాజం గురించి మాట్లాడేటప్పుడు, ఇతరుల గురించి ప్రస్తావించేటప్పుడు నోటిని మరింతగా అదుపులో పెట్టుకోవాలి. మాటలు సున్నితంగా లేకుండా పరుషంగా ఉంటే, అవి పదునైన కత్తుల్లా మనసుకు గాయాలు చేస్తాయి. అయితే, అంతటి గాయాలను కూడా మాన్పే శక్తి ఒక్క మాటలకే ఉంటుంది. అదే మాట మహత్యం!.. ఏదేమైనా, మాటలు సమాజంలో మంటలు పెట్టకూడదు. చేతనైతే మంచిమాటలతో అలాంటి మంటలను కూడా చల్లార్చగలగాలి. మాటలు సమాజాన్ని బాగా ప్రభావితం చేస్తాయి. అందువల్ల మాటలు మాట్లాడేటప్పుడు, మనమేం మాట్లాడబోతున్నామో ఒకసారి కాదు పదిసార్లు పరిశీలించుకోవాలి. మాటంటే రాముని వాక్కులా ఉండాలి. సత్యధర్మాలని కాపాడుతూ, దుష్టత్వాలపై ఎక్కుపెట్టే రామబాణంలా ఉండాలి. మనకి అన్నం పెట్టే అమ్మలాంటి సమాజం పట్ల గౌరవం కలిగేలా మాటలుండాలి కానీ, మన సమాజాన్ని మనమే కించపరుచుకోవడం కంటే పాపం మరొకటి ఉండదు. అసత్యాలు, అనుచితపు మాటలు ఎప్పటికీ సమర్థనీయం కాదు. చివరికి నిలిచేది, గెలిచేది సత్యమేనన్నది తెలుసుకోవాలి. చెట్టులోని సారమంతా పండులో కనిపించినట్లే, మన గుణాలే మన మాటల్లో కనిపిస్తాయి. మన మాటలే మనల్ని ముందుకు నడిపిస్తాయి. అందుకే, 'సంస్కారానికి గీటురాయి మాటలే' అన్నారు పెద్దలు. ఇప్పుడు సరిగ్గా మనకు కావాల్సింది అదే!.. నేటి కాలంలోనే కాదు, ఏ కాలంలోనైనా సరే, మంచి మాటలే కలకాలం ఆదర్శంగా నిలుస్తాయి!..మంచి మాటలే సత్సమాజ స్థాపనకు మంచి బాటలు వేస్తాయి...!

- రాజశ్రీ

# సమయానికి ఆదుకున్న 'తల్లికి వందనం'

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ప్రభుత్వాలు ప్రజలకు ఏ పథకం అందించినా, అది అవసరానికి ఉపయోగపడకపోతే, ఆ పథకాలన్నీ వృథా అవుతాయి. గత ప్రభుత్వంలో 'అమ్మఒడి' పథకం ఒక్కసారి కూడా సరైన సమయానికి రాలేదు. డిసెంబర్, జనవరి నెలల్లో డబ్బులు ఖాతాలలో పడడంతో ఆ డబ్బుని చాలామంది ఇతర ఖర్చులకు ఉపయోగించుకున్నారు. పిల్లల చదువులకు మాత్రం ఆ డబ్బు ఉపయోగపడలేదు. కానీ, కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం సరైన సమయంలో అందించింది. సరిగ్గా పిల్లల బళ్ళు తెరిచే సమయంలో ఆ డబ్బులు ఖాతాలలో పడ్డాయి. దీంతో చాలామంది తమ పిల్లల చదువులకు ఆ డబ్బును ఉపయోగించుకోవడం సంతోషదాయకం. సరైన సమయంలో అందించడమే కాక ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' అందించడం కూటమి ప్రభుత్వం ఘనత అనే చెప్పుకోవాలి. 'తల్లికి వందనం'తో అనేక కుటుంబాల్లో ఆనందాన్ని నింపిన కూటమి ప్రభుత్వానికి నా ధన్యవాదాలు.

- జే.యస్.కృష్ణ,
వై.యస్.ఆర్.నగర్, నెల్లూరు.

## పర్యావరణ పరిరక్షణలోనూ శ్రీసిటీ
# మేటిగా నిలవడం అభినందనీయం

శ్రీసిటీ పారిశ్రామికంగా అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించుకోవడమే కాదు, పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం కాపాడేందుకు ఎంతగానో కృషి చేస్తుండడం అభినందనీయం. ఇటీవల శ్రీసిటీలో నవగ్రహాలు, రాశులు, నక్షత్రాల పేరుతో కూడా వనాలను ఏర్పాటు చేయడం, వాటిని ప్రఖ్యాత స్వామీజీ శ్రీ విశ్వవల్లభ తీర్థస్వామి వారు ప్రారంభించడం చూస్తే, శ్రీసిటీ ఆధ్యాత్మికతను పరిరక్షించడంలో కూడా ముందంజలో ఉంటుండడం సంతోషం కలిగిస్తోంది. శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న ఆధ్యాత్మిక, సాహిత్య, కళారంగాలకు సంబంధించిన ఎన్నో కార్యక్రమాలను మన 'లాయర్'లో చూస్తున్నాం. అవన్నీ ఎంతో ఆసక్తిగా ఉంటుంటాయి. పారిశ్రామికంగానే కాక పర్యావరణ పరిరక్షణలోనూ శ్రీసిటీ సేవలు ఎంతో ఆదర్శ ప్రాయంగా ఉంటున్నాయి. శ్రీసిటీ యాజమాన్యానికి అభినందనలు!

సి.ఆర్.విశ్వేశ్వరరావు, మాజీ ఉపకులపతి, హైదరాబాదు.

## ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం..
# అత్యంత విషాదం

అహ్మదాబాద్ విమానప్రమాద ఘటన అందరి మనసులను కలచివేసింది. ఆ విమానం వైద్యవిద్యార్థులుంటున్న హాస్టల్ భవనంపై పడి, అందులో ఉన్న కొంత మంది మెడికోలు ప్రాణాలు పోగొట్టుకోవడం అత్యంత బాధాకరం. మొత్తంగా ఈ ప్రమాదంలో 279మంది దాకా చనిపోయారని వార్తా సంస్థలు, అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. విమానం గాలిలోకి ఎగిరిన కొద్దిక్షణాలలోనే కూలిపోవడం, ఇంజన్లు పేలిపోయి ఆ మంటల్లో ప్రయాణీకులందరూ మాడి బూడిదైపోవడం ఘోరాతి ఘోరం. ఆ మృతుల కుటుంబాల గోడు వర్ణనాతీతం. ఊహించుకొంటేనే విచారకరం. అయినా, విధి ఇంత బలీయంగా, ఇంత కర్కశంగా ఉంటుందా?

ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.



# ముఖ్యమంత్రి సహాయనిధి..
# పేదలకు గొప్ప వరం!

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా ఉంటోందని, నిరుపేదలు. బడుగు బలహీనవర్గాల ప్రజలు ఎంతోమంది బాధితులు ఆ నిధి ద్వారా ప్రయోజనం పొందుతున్నారని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు చికిత్సలు పొందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం పొందిన పేదలకు కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప వరమని అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరురూరల్ నియోజకవర్గంలో 16మందికి మంజూరైన రూ. 14లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వారికి ఉదారంగా సాయం మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటి 35 లక్షల రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రజలకు అందించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్**



జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అందరూ విజయవంతం చేయాలని, జిల్లావ్యాప్తంగా నిర్వహించే యోగా కార్యక్రమాల్లో ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా జూన్ 21 యోగా దినోత్సవానికి ప్రజలను సన్నద్ధం చేసేందుకు ఇటీవల నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ, ఎన్‌సిసి విభాగం సంయుక్తంగా నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె కార్తీక్, మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు, చిన్నారులు అందరూ యోగాసనాలు వేశారు. జూన్ 21న జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు స్థాయిలో 7వేల ప్రాంతాల్లో 124మంది మాస్టర్ ట్రైనర్లు, 5000 మంది పైగా సచివాలయ యోగా అభ్యాసకుల చేత యోగా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ యోగాను ఒక దినచర్యగా మార్చుకోవాలని. జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.హరికృష్ణ, నోడల్ అధికారి, జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ అధికారి యతిరాజ్, సెట్నల్ సీఇవో నాగేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత, యోగా గురువులు స్వప్న, ముత్యాల రవీంద్ర, 24 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి విద్యార్థులు, మాజీ సైనికులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో చికెన్ వ్యర్థాలు



ఆత్మకూరు మండలంలో ఈనెల 16న ఓ చికెన్‌వ్యర్థాల లారీని స్థానిక జనసేన నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు నలిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ, ఆత్మకూరు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో చేపలగుంటల్లో చేపల మేత కోసం తమిళనాడు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి చికెన్ వ్యర్థాలను తీసుకొచ్చి వేస్తున్నారన్నారు. చేపలమేతకు చికెన్ వ్యర్థాలను నిషేధిస్తూ ప్రభుత్వం 2016లోనే జీఓ జారీ చేసిందని, అయినప్పటికీ ఆ వ్యర్థాల అక్రమరవాణా జోరుగానే జరుగుతోందన్నారు. ఈ వ్యర్థాల వాడకం వల్ల వాటిని తిన్న ప్రజలకు క్యాన్సర్, లివర్‌కి సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అందువల్ల అధికారులు ఈ వ్యర్థాలు తీసుకువస్తున్న వాహనాలను వెంటనే అరికట్టాలని కోరారు. జనసేన నాయకులు అనిల్‌రాయల్, నాగరాజు యాదవ్, మదన్‌కుమార్‌యాదవ్, భాస్కరయ్య, రాఘవేంద్ర, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానమంటే..
# ప్రాణదానం

**డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత**



రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత అన్నారు. ఇటీవల ఆమె భారతీయ స్టేట్ బ్యాంక్ 70వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా రెడ్‌క్రాస్ సౌజన్యంతో నెల్లూరు రంగనాయకులపేటలోని ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై రక్తదాన ప్రాధాన్యతను వివరించారు. రక్తదానమంటే ప్రాణదానమేనని, మనం చేసే రక్తదానం ఒక నిండు ప్రాణాన్ని నిలుపుతుందని చెప్పారు. రక్తదానం వల్ల శారీరకంగా అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అపోహలు వీడి స్వచ్ఛంధంగా రక్తదానం చేసేందుకు ముందుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ పి.మురళీ నాయక్ మాట్లాడుతూ సమాజ సేవలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ శిబిరంలో సుమారు 150మందికి పైగా పాల్గొని రక్తదానం చేశారు. ఉద్యోగులు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

# 'వేద విజ్ఞాన వేదిక'
# కార్యక్రమం.. 29న

చెన్నైలోని 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న ఉపన్యాస ధారావాహికలో భాగంగా ఈనెల 29న 162వ ప్రసంగ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆ వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు. టీ-నగర్‌లోని కృష్ణా హాల్ ఆంధ్రాక్లబ్‌లో ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఉపన్యాస వేదికలో ప్రముఖ సాహితీవేత్త.. అన్నమాచార్య వాఙ్మయ పరిశోధకులు గంధం బసవశంకరరావు (హైదరాబాద్) పాల్గొని 'తిమ్మన పారిజాతాపహరణం-మానసోల్లాస వ్యాఖ్యానం' అనే అంశంపై ఉపన్యసిస్తారని వారు తెలియజేశారు. సాహితీప్రియులందరూ ఈ కార్యక్రమానికి వచ్చి జయప్రదం చేయాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# వృద్ధులను గౌరవించాలి

సమాజంలో వయోవృద్ధుల సంరక్షణ, పోషణ అనేవి సామాజిక బాధ్యతలని, వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని లోక్‌సత్తా ఉద్యమసంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి కోరారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఇటీవల ఆయన మాట్లాడుతూ బిడ్డలు తల్లిదండ్రులను ఆదరించాలన్నారు. నిరాదరణకు గురైన వృద్ధులు లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని ఆయన తెలిపారు. వృద్ధులను నిర్లక్ష్యం చేసి నిరాదరణకు గురి చేయడం మంచిది కాదన్నారు.

## పర్యావరణ హిత సంస్థగా...
# శ్రీసిటీ-నాఫ్ ఇండియా పరిశ్రమకు గుర్తింపు

**- - గ్రీన్‌కో సమ్మిట్‌లో అవార్డు బహుకరణ - -**



అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన శ్రీసిటీలోని నాఫ్ ఇండియా పరిశ్రమకు ప్రతిష్టాత్మక 'గ్రీన్' (పర్యావరణ హిత సంస్థ) గుర్తింపు లభించింది. ఇటీవల హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించిన 'గ్రీన్‌కో సమ్మిట్ 2025' కార్యక్రమంలో ఈ అవార్డును నాఫ్ ఇండియాకు బహుకరించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో నికర-సున్నా పరివర్తన, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి, ఏఐ తదితర రంగాలకు సంబంధించిన అంతర్జాతీయ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్త మార్గదర్శకాలకు అనుగుణంగా సీఐఐ అభివృద్ధి చేసిన గ్రీన్‌కో రేటింగ్ వ్యవస్థ ద్వారా వివిధ సంస్థల పర్యావరణ పనితీరును అంచనా వేస్తుంది. మరియు సహజ వనరుల సమర్థవంతమైన వినియోగం, కాలుష్య తగ్గింపు, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహిస్తుంది. ఈ మేరకు గుర్తింపు పొందిన నాఫ్ ఇండియా, గ్రీన్ తయారీ, పర్యావరణ నిర్వహణలో తన నిబద్ధతను చాటుకుంది. తక్కువ-కార్బన్ ఉత్పత్తి పద్ధతులను వినియోగించి నాణ్యమైన నిర్మాణ సామగ్రి వినియోగంతో పాటు శక్తి మరియు నీటిని సమర్థవంతంగా కంపెనీ ఉపయోగించింది. దేశంలో పర్యావరణ స్పృహతో కూడిన మౌళిక సదుపాయాల కల్పనకు ఇది అద్దం పడుతోంది. ఈ సందర్భంగా నాఫ్ బృందాన్ని శ్రీసిటీ వ్యవస్థాక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. ఈ గుర్తింపు శ్రీసిటీకి గర్వకారణం అంటూ తన సందేశంలో పేర్కొన్నారు. తాము ప్రోత్సహించే సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి స్ఫూర్తిని ఇది ప్రతిబింబిస్తుందన్నారు. 'గ్రీన్' తయారీకి కొత్త ప్రమాణాలను పాటించడంలో ఇతర సంస్థలకు నాఫ్ ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

# సహకార ఉద్యోగుల సంఘం వజ్రోత్సవాలు

- **ఏకగ్రీవంగా కొత్త కమిటీ ఎన్నిక**



ఆంధ్రప్రదేశ్ సహకార కేంద్రబ్యాంకుల ఉద్యోగుల సంఘం (ఏపీసీసీబీఇఓ) నెల్లూరు యూనిట్ నెలకొల్పి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 14న వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏనుగు సుందరరామిరెడ్డి స్మారక ఆడిటోరియంల్ జరిగిన ఈ వేడుకల్లో విశ్రాంత సహకార బ్యాంక్ ఉద్యోగులను సన్మానించారు. అనంతరం ఆ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీసీసీబీఇఏ నెల్లూరు జిల్లా శాఖ అధ్యక్షురాలిగా ఎస్.శ్రీవిద్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె. బాలకృష్ణయ్య, కె.సుధీర్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.వర్ధన్‌రాజు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీలుగా ఎం.సుబ్రహ్మణ్యం, కె. హరిప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.వెంకట్రావు, ఫస్ట్ సెక్రటరీగా కె.రోహిత్, జిల్లా సెక్రటరీగా సిహెచ్ సుబ్బారెడ్డి, కోశాధికారిగా కెవి కల్యాణ్‌చక్రవర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా వి.హరీష్, వి.దినేష్, కె.మహేష్‌కుమార్, ఎస్‌డి అఖిల, ప్రవీణ్, ఎం.నాగరాజు, బి.రాధిక, ఐ.రాజేష్ ఎన్నికయ్యారు. బి.ప్రసూన, బి.హరిత, దేవసేన, కెఎల్ పవిత్ర, కె.మధుప్రియ, సుప్రియ, ఎం.స్వప్న, ఎం.డి షబ్నా, వి.మౌనికలతో మహిళా కమిటీ కూడా ఏర్పాటైంది. రాష్ట్ర ప్రతినిధులుగా వి.కృష్ణారెడ్డి, పరంధామయ్య ఎన్నికయ్యారు.

# ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఇ విభాగంలో పనిచేస్తున్న వి. భువనకుమార్‌కు డాక్టరేట్ లభించింది. హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్-చెన్నై వారు ఆయనకు డాక్టరేట్‌ని ప్రదానం చేసినట్లు ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. 'ఏసీఓఏ-ఎల్ఎస్‌టీఎం మరియు రెసిడ్యువల్ జీఆర్‌యు ఆధారంగా ఎంఐడిఐ మ్యూజిక్ జనరేషన్ మరియు గుర్తింపు ఆప్టిమైజ్ చేయడం' అనే అంశంపై భువనకుమార్‌కు డాక్టరేట్‌ని బహుకరించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన్ను కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఏ.రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు. భువనకుమార్ మాట్లాడుతూ, తాను విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో చదువుకుని, ఆ విద్యాసంస్థల్లోనే పనిచేస్తున్నానని, తాను డాక్టరేట్ పొందడానికి కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఎంతో సహాయ సహకారాలు అందించారని చెప్తూ, రాంకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

## కడుపుమంటతోనే..
# మతిలేని ఆరోపణలు
### - వైకాపా నేతలపై మండిపడ్డ మంత్రి నారాయణ



'తల్లికి వందనం' వంటి మంచి పథకాలను వైకాపా వారు కడుపుమంటతో విమర్శిస్తూ, డబ్బులన్నీ లోకేష్ ఖాతాలోకి పోతున్నాయంటూ లేనిపోని ఆరోపణలు చేస్తుండడం దారుణమంటూ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా.పొంగూరు నారాయణ మండిపడ్డారు. ఇటీవల ఆయన నెల్లూరులో మాట్లాడుతూ, ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే వారందరికీ 'తల్లికి వందనం' పథకం ఇస్తున్నామని, ఒకేరోజున ఆ పథకానికి 10వేల కోట్లు కేటాయించి, 67.25 లక్షల మందికి ఆ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంజూరు చేశారని అన్నారు. వైకాపా వారు అయిదేళ్ళపాటు అరాచక పాలన సాగించి, ఖజానాని ఖాళీ చేసినా, ఇంతటి బృహత్తరమైన పథకాలను టీడీపీ కూటమి ప్రభుత్వం అమలుచేస్తోందని, అయినప్పటికీ తమపై మతిలేని ఆరోపణలు చేస్తూనే ఉండడం ఘోరమని అన్నారు.

## జర్నలిస్టు దయాశంకర్‌కి..
# రక్తదాత అవార్డు




పత్రికారంగంలో ఉంటూ సేవాభావంతో రక్తదానం చేస్తున్న 'విశాలాంధ్ర' సీనియర్ జర్నలిస్టు దయాశంకర్‌కి జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ 'రక్తదాత అవార్డు'నిచ్చి అభినందించింది. ఇప్పటికి 87 సార్లు ఆయన రక్తదానం చేసి, పాత్రికేయరంగానికే ఆదర్శంగా నిలిచారు. జర్నలిస్టుగా ఉంటూ ఇన్నిసార్లు రక్తదానం చేయడం ఎంతో అరుదైన విషయం కూడా. ఈనెల 15న నెల్లూరులో జరిగిన ప్రపంచ రక్తదాన దినోత్సవంలో రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, రక్తదాతల స్ఫూర్తిప్రదాత తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యుల సమక్షంలో దయాశంకర్ ఆ అవార్డును అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం చేయడమంటే మరొకరి ప్రాణాలు నిలబెట్టడమేనని, కనీసం వందసార్లయినా రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

## అధిక ఫీజులను అరికట్టండి

విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా కోరారు. నెల్లూరులోని జర్నలిస్టు భవన్‌లో ఈనెల 17న ఆయన విలేకర్లతో మాట్లాడారు. పలు విద్యాసంస్థలు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, పుస్తకాలను విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆయన విమర్శించారు.

# 'తల్లికి వందనం'.. ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం
### - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.15 వేలు అందించి వారి విద్యాభ్యాసానికి బాటలు వేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ పథకంపై వైకాపా వాళ్ళ తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి కింద 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకాన్ని అమలుచేస్తోందన్నారు. గత ప్రభుత్వం రూ.5 వేల కోట్లు ఖర్చుచేస్తే.. తమ ప్రభుత్వం రూ. 10వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో కుటుంబంలో ఒక్కరికే ఈ పథకాన్ని అమలు చేశారని, కానీ నేడు ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ వర్తింపజేస్తున్నారన్నారు. లబ్ధి పొందిన వారిలో బీసీలు 29.82 లక్షల మంది, ఎస్సీ విద్యార్థులు 11.76 లక్షల మంది, ఎస్టీ విద్యార్థులు 4.26 లక్షల మంది, మైనారిటీ విద్యార్థులు 66500 మంది, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు 8.4 లక్షలమంది ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరుస్తోందని చెప్పారు. గత ప్రభుత్వంలో 'అమ్మ ఒడి' నిధులు ఎప్పుడు పడతాయా అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేచి చూసేవారని, కానీ నేడు పాఠశాలలు ప్రారంభమైన రోజునే విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేసిందన్నారు. అలాగే ఒకటవ తరగతిలో, ఇంటర్ ఫస్టియర్‌లో చేరే విద్యార్థులకు కూడా ఈ పథకం అమలుచేసేందుకు కృషి జరుగుతోందని చెప్పారు. తల్లికి వందనం అమలుచేసి విద్యార్థుల తల్లితండ్రుల కళ్ళల్లో ఆనందం నింపిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌బాబులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.




# నీట్ ఫలితాల్లో 'విశ్వసాయి' ప్రభంజనం

ఎన్‌టీఏ వారు ఇటీవల ప్రకటించిన జాతీయ స్థాయి నీట్-2025 పరీక్షల ఫలితాల్లో నెల్లూరులోని 'విశ్వసాయి' కళాశాల విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో పాటు, అత్యధిక మార్కులు సాధించి జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నారని విశ్వసాయి కళాశాల ఛైర్మెన్ డా.ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఇటీవల స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని విశ్వసాయి కళాశాలలో ఏర్పాటుచేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ కళాశాల నుంచి 103 మందికిపైగా విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్‌లో చేరడానికి అర్హత సాధించారన్నారు. వారిలో బి.భానుశ్రీ సులోచన 543 మార్కులను, వి.హారిణి 542, ఎం.చేతన్ 531 వంతున అత్యుత్తమ మార్కులు సాధించారని, ఒకే కళశాల నుంచి 103 మందికిపైగా విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్‌లలో చేరబోవడం తమకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని, అంతటి ఘన విజయాలను సాధించిన విద్యార్థులకు, వారిని ఉత్తమంగా తీర్చిదిద్దిన అధ్యాపకులు, అధ్యాపకేతర బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, పత్తిడిలేని శిక్షణతో పాటు విద్యార్థుల పట్టుదలే ఈ విజయాలకు కారణమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్‌పర్సన్ ఎన్.రుక్మిణి పాల్గొన్నారు.

## 26 నుండి శ్రీ గురు దత్తాత్రేయ మఠంలో...
# శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి వేడుకలు



నెల్లూరు పప్పులవీధిలోని కుర్తాళ శ్రీ సిద్ధేశ్వరి పీఠ విభాగం శ్రీ గురు దత్తాత్రేయ మఠంలో కొలువైవున్న శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు జూన్ 26 నుండి ప్రారంభమై జులై 4వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఆ మేరకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకి వారాహీ అమ్మవారికి క్షీరాభిషేకం, సాయంత్రం విశేష పూజలు చేయనున్నారు. కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారులు శ్రీ దత్తేశ్వరానంద భారతీ మహాస్వామి వార్ల దివ్య ఆశీస్సులతో జరిగే ఈ ఉత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని శ్రీ గురు దత్తాత్రేయ మఠం మేనేజర్ మాచవోలు అనూరాధ తెలిపారు. ఈ పూజల్లో పాల్గొని తమ గోత్రనామాలతో అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, హోమం చేయదలచుకున్నవారు.. వివరాలకు, వారి గోత్ర నామాల నమోదుకు ఫోన్ 94405 32936 లేదా 94405 88359 నెంబర్లతో సంప్రదించాలని ఆమె సూచించారు.

## నెల్లూరీయునికి
# 'జ్యోతిష్య రత్న' బిరుదు



నెల్లూరులోని హరినాథపురానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య నిపుణులు భాస్కరయ్యకు 'జ్యోతిష్య రత్న' బిరుదు లభించింది. హైదరాబాదులో ఇటీవల జరిగిన విశ్వ జ్యోతి జ్యోతిష్య సమ్మేళనంలో ఆయనకు ఆ బిరుదును ప్రదానం చేశారు. బహు గ్రంథ కర్త పుచ్చా శ్రీనివాసరావు, జ్యోతిష్య విశారద గ్రంథ రచయిత పాలపర్తి శ్రీకాంత్ శర్మ, కంచి కామకోటి సర్వజ్ఞ పీఠ ఆస్థాన సిద్ధాంతి తదితర ప్రముఖులు ఆయన్ను సువర్ణకంకణంతో ఘనంగా సన్మానించారు.




# ప్రజలను మభ్యపెడుతున్న టీడీపీ
### - వైకాపా నాయకుల ధ్వజం



ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతోందని వైకాపా నాయకులు ధ్వజమెత్తారు. నెల్లూరులోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో ఇటీవల జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ మేరీగ మురళిలతో కలిసి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్న ప్రతిపక్ష నేతలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. తల్లికి వందనం పథకాన్ని.. కూటమి ప్రభుత్వం తూతూ మంత్రంగా నిర్వహించిందన్నారు. పూర్తిస్థాయిలో లబ్ధిదారులందరికీ 'తల్లికి వందనం' పథకం అందడం లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. ప్రతిపక్ష పార్టీ నేతలపై ఇష్టారీతిలో కేసులు పెడుతుండడం దారుణమన్నారు. వైసీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, ఏఎంసి మాజీ ఛైర్మెన్ కోటేశ్వర రెడ్డి, కార్పొరేటర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# రొట్టెల పండుగ ఏర్పాట్లు ఘనంగా ఉండాలి

## - అధికారులతో మంత్రి నారాయణ



మతసామరస్యానికి ప్రతీకగా.. నెల్లూరు నగరంలోని ప్రపంచ ప్రసిద్ధమైన బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు ఘనమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులకు సూచించారు. ఇటీవల ఆయన కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆ ఏర్పాట్ల విషయం సమీక్షించారు. జులై 6 నుండి ప్రారంభమయ్యే రొట్టెల పండుగ ఏర్పాట్లపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రొట్టెల పండుగను దృష్టిలో ఉంచుకుని, ఎంతో ఘనమైన చరిత్ర గల బారాషహీద్ దర్గా అభివృద్ధికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా 5 కోట్లు మంజూరు చేయడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. దర్గా అభివృద్ధిలో భాగంగా, దర్గా ప్రాంగణంలో 20 వేల మంది భక్తులు ఒకేసారి ప్రార్థనలు చేసేందుకు అనుకూలంగా ప్రార్థన మందిరాన్ని నిర్మిస్తామన్నారు. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా 'నుడా' ఆధ్వర్యంలో ఈ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. రొట్టెల పండుగలో భక్తులకు అవసరమైన ఇతర ఏర్పాట్లపై మున్సిపల్ అధికారులు జాయింట్ కలెక్టర్‌తో సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. ప్రపంచ ప్రఖ్యాత నెల్లూరు బారాషహీద్ దర్గా అభివృద్ధికి మంత్రి నారాయణ సహకారంతో ముఖ్యమంత్రి రూ. 5 కోట్ల నిధిని మంజూరుచేయడం సంతోషదాయకమని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు.



# విలువలతో కూడిన చదువే.. 'విపిఆర్ విద్య' లక్ష్యం

## - వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విలువలతో కూడిన విద్యను అందించడమే విపిఆర్ విద్య పాఠశాల లక్ష్యమని, ఆ లక్ష్య సాధనకు నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి చేస్తున్నారని విపిఆర్ సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడులో ఉన్న 'విపిఆర్ విద్య' పాఠశాలలో ఆమె ఇటీవల విద్యార్థులకు స్కూల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ ఏడాది కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులతో పాటు, పాఠశాలలో ఇంతకుముందునుంచీ చదువుతున్న విద్యార్థులకు కూడా ఆ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే ఉద్దేశంతో 2016లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) 'విపిఆర్ విద్య' పాఠశాలను నెలకొల్పారన్నారు. స్థాపించిన నాటి నుంచి నేటివరకు పేదపిల్లలకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. పేదపిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడమే ఈ పాఠశాల ప్రధాన ధ్యేయమన్నారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు కూడా విపిఆర్ ఫౌండేషన్ సంకల్పించిందన్నారు. ఈ ఏడాది 587 మార్కుల సాధించిన గాయత్రి అనే విద్యార్థిని ఉన్నత చదువులకు విపిఆర్ ఫౌండేషన్ సహాయం చేస్తుందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సేవా తత్పరతకు 'విపిఆర్ విద్య' ఒక ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పాఠశాల విద్య అభివృద్ధి చెందుతోందన్నారు. ఇటీవల 'షైనింగ్ స్టార్స్' అవార్డుల కార్యక్రమం ద్వారా విద్యార్థులను సన్మానించడం గొప్ప విషయం అన్నారు. ఆ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ముగ్గురు దివ్యాంగ విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. విపిఆర్ లాంటి సమాజసేవా భావం ఉన్న వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకుని, విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపక-అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధికి..రాష్ట్రస్థాయి అవార్డులు

## మంత్రి సత్యకుమార్ చేతులమీదుగా బహుకరణ




జిల్లాలో ఉత్తమ సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థకి అవార్డులు వచ్చాయి. రక్తసేకరణలో ముందుంటున్నందుకు అభినందనలు లభించాయి. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న గుంటూరులోని భారతీయ విద్యా భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రెడ్‌క్రాస్ పాలకమండలి వైస్ ఛైర్మన్ చమర్తి జనార్ధన్‌రాజును, రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ అజయ్‌బాబును రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అభినందించి అవార్డులను బహుకరించారు. అదేవిధంగా ఇండస్ట్రీ, పబ్లిక్ సెక్టార్ విభాగానికి చెందిన కౌషల్‌సింగ్, అదాని కృష్ణపట్నం పోర్టుకు చెందిన సేఫ్టీహెడ్ సురేంద్ర కుమార్ బృందానికి ప్రతిభా అవార్డులు లభించాయి. అత్యధిక రక్త సేకరణలో ద్వితీయస్థానం పొందిన శ్రీసిటీకి అవార్డును బహుకరించారు. అనంతరం రాష్ట్రస్థాయిలో అత్యధికంగా 119సార్లు రక్తదానం చేసిన నెల్లూరు రక్తనిధి..రక్తదాన మోటివేటర్ మదనపల్లి మధుసూదన్ రావును మంత్రి సత్యకుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

**కావలికి 5 అవార్డులు :**

రక్తదాన సేవల్లో ఉత్తమంగా రాణిస్తున్న కావలి రెడ్‌క్రాస్ రక్తనిల్వ కేంద్రానికి 5 అవార్డులు లభించడం విశేషం. సేవియర్స్ స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు నల్లిపోగు ప్రణీత్, డాక్టర్ టి.రమ్య, విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిపాలనాధికారి కె. రామకృష్ణ, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డి.రవిప్రకాష్, కోశాధికారి ఆరికట్ల మధుసూదన్‌రావులు ఈ అవార్డులను అందుకున్నారు.

# సింహపురి వైద్యసేవాసమితి సేవలు అపూర్వం



గిరిజనుల అభ్యున్నతి కోసం నెల్లూరులోని సింహపురి వైద్య సేవాసమితి వారు చేస్తున్న కార్యక్రమాలు అపూర్వమైనవంటూ పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు ఈ సేవాసమితి వారు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 15వ తేదీ ప్రారంభమైన ఈ కార్యక్రమాలు 30వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సింహపురి వైద్య సేవాసమితి ఆధ్వర్యంలో గిరిజన నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నగర మేయర్ పొట్లూరు స్రవంతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో సింహపురి వైద్య సేవాసమితి గిరిజనుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రత్యేకించి విద్యా వైద్య రంగాలలో గిరిజనులకు వారు చేస్తున్న సేవ చాలా గొప్పదని అభినందించారు. తొలుత జయభారత్‌లోని గిరిజన 10 పడకల ఆసుపత్రిలో ఆరోగ్య గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జయభారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు పోట్లూరి శ్రీనివాసులు, ఆడిటింగ్ డిప్యూటీ డైరెక్టర్ యాకసిరి వెంకటేశ్వర్లు, వేటగిరి సుధాకర్‌రావు, మోహన్‌రావు, రాజగిరి శ్రీనివాసులు, తలపుల మురళి తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ మాజీ ఛైర్మెన్.. బాలచెన్నయ్య అస్తమయం



నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా సేవలందించిన డా. బాలచెన్నయ్య ఇటీవల అస్వస్థతకు గురై, ఈనెల 14న కన్నుమూశారు. అటు వైద్యునిగా, ఇటు రాజకీయనేతగానే కాక, దళితబాంధవునిగా ఆయన ప్రసిద్ధి చెందారు. 1983 నుంచి 1985 వరకు జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా పనిచేసి, బడుగు బలహీనవర్గాల వారికి తనవంతు చేయూతనందించారు. బాలచెన్నయ్య మృతి బాధాకరమంటూ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విచారం ప్రకటించారు. డాక్టర్‌గా, దళిత నాయకునిగా బాలచెన్నయ్య సేవలు మరిచిపోలేనివన్నారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. బాలచెన్నయ్య స్మృతికి నివాళులర్పిస్తోంది 'లాయర్'.

# డీఐపీఆర్ఓగా.. శివశంకర్‌రావు



జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి (డీఐపీఆర్ఓ)గా ఏ.శివశంకర్‌రావు ఈనెల 16న పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం నెల్లూరులోని కార్యాలయంలోనే ఆయన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సదారావు బదిలీతో, ఆయన స్థానంలో శివశంకరరావు నియమితులయ్యారు. ప్రభుత్వ అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు తనవంతు కృషి చేస్తానని, జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వపరంగా సేవలను అందిస్తానని శివశంకర్‌రావు చెప్పారు.



# పశ్చిమాసియాలో అనిశ్చితి!

మనసులో మాట 50

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం, అమెరికా కూడా రంగంలోకి దిగనుందన్న సంకేతాలు వెలువడడంతో పశ్చిమాసియా మొత్తం అనిశ్చితిలోకి జారిపోయింది. ఇరాన్‌లో 2025 జూన్ 13వ తేదీన తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దళం రెండువందల యుద్ధవిమానాలతో విరుచుకు పడింది. వంద లక్ష్యాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో ఏకంగా ఇరాన్ సైన్యాధిపతి సహా అనేక మంది సైనిక ఉన్నతాధికారులు, అణుశాస్త్రవేత్తలు మరణించారు. ఆకస్మికదాడిని ఊహించని ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. దాదాపు వారం రోజులుగా జరుగుతున్న దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఎప్పుడేమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇరాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఈ ప్రాంతంలో పలు దేశాలు తమ గగనతలాలను మూసివేయడంతో వేలమంది పౌరులు చిక్కుకుపోయారు.

శత్రువులు ప్రయోగించే క్షిపణులు, డ్రోన్ల నుంచి దుర్భేధ్యమైన రక్షణ ఇస్తున్న ఇజ్రాయెల్ ఐరన్ డ్రోమ్‌ను దాటుకుని మరీ ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌పై దాడి చేయడంతో యుద్ధం ఏకపక్షం కాదన్న సంగతి అందరికీ అర్థమైంది. ఈ నేపథ్యంలోనే కెనడాలో జరుగుతున్న జి7 కూటమి సమావేశాల నుంచి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒక రోజు ముందుగానే వెనుదిరగడంతో పాటు ఇరాన్ అధినేత అయితుల్లా ఖొమైనీని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలతో ఏదో పెద్ద పరిణామమే జరగబోతోందని పరిశీలకులు భావిస్తున్నారు.

అణుబాంబుల తయారీకి ఇరాన్ పూనుకోవడమే ఈ యుద్ధానికి కారణమైంది. ఇరాన్ అణ్వస్త్రశక్తిగా మారితే తమ ఉనికికి ప్రమాదమని ఇజ్రాయెల్ భావిస్తోంది. ఇజ్రాయెల్ ప్రధానంగా యూదుల నివాస దేశం. వారి ఉనికి పోరాటం ఇప్పటిది కాదు. జర్మనీలో హిట్లర్ ఊచకోతతో లక్షల మంది యూదులు మరణించారు. గతంలో ఉన్న పాలస్తీనా భాగాన్ని రెండు దేశాలుగా చేసి యూదులకు ఒక సార్వభౌమ దేశం ఇవ్వాలని ఐక్యరాజ్యసమితి 1947లో తీర్మానించింది. అయితే అరబ్బులు అందుకు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలోనే 1948లో బ్రిటిష్ వారు పాలస్తీనా నుంచి వైదొలగడంతో ఇజ్రాయెల్ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంది. ఆ వెంటనే అరబ్బుదేశాలైన ఈజిప్టు, సిరియా, జోర్డాన్, ఇరాక్ దేశాలు తమ సైన్యాలతో ఇజ్రాయెల్‌పై దాడి చేశాయి. అయితే, కొత్తగా ఏర్పడిన ఇజ్రాయెల్ సైన్యం వారి దాడిని సమర్థంగా తిప్పికొట్టింది. ఆ తర్వాత నుంచి అరబ్బు దేశాల్లో ఉన్న యూదులపై దాడులు, వివక్ష పెరిగిపోయాయి. దాంతో ఆ ప్రాంతాల నుంచి యూదులు కొత్తగా ఏర్పడిన ఇజ్రాయెల్‌కు శాశ్వతంగా తరలి రావడం ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన యూదులు కూడా ఇజ్రాయెల్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకోవడానికి ఆసక్తి చూపించారు. ఈ రకంగా యూదులది ఆది నుంచి ఉనికి పోరాటంగా ఉంది. ఆ పోరాటమే వారిని మొండివారిగా మార్చింది. ఎంతలా అంటే తమకు హాని తలపెట్టిన వారు ప్రపంచంలో ఎక్కడ తలదాచుకున్నా వెదికి మట్టుబెట్టేంత. హాని తలపెట్టడం సంగతి అటుంచి భవిష్యత్తులో ప్రమాదకరంగా మారతారని భావిస్తే చాలు ముందుగానే ఇజ్రాయెల్ దాడి చేస్తుంది. తమ ఉనికి కోసం పోరాడుతున్న ఇజ్రాయెల్.. గాజాలో సాధారణ అరబ్బులు ఎంత దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నదీ పట్టించుకోవడం లేదు. గాజాలో హమాస్‌తో నిత్యం తాము పోరాడుతుంటే వారికి ఇరాన్ నేరుగా మద్దతు ఇస్తుండడంతో ఇజ్రాయెల్ భగ్గుమంది. అణ్వస్త్ర దేశంగా మారితే ఇరాన్ నుంచి తీవ్ర ముప్పు ఉంటుందని భావిస్తోంది. అందుకే ప్రపంచ దేశాల మాటలను కూడా ఖాతరు చేయకుండా యుద్ధానికి దిగింది. మరోవైపు అమెరికాకు కూడా ఇరాన్ అణ్వస్త్ర దేశంగా మారడం అసలు ఇష్టం లేదు. తమ వద్ద ఎన్ని అణ్వస్త్రాలైనా ఉండొచ్చు కానీ ప్రపంచంలోని ఏ దేశమూ అణ్వస్త్రాలు తయారు చేయకూడదన్నది అమెరికా విధానం. అందుకే అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందానికి పట్టుబడుతోంది. ఇరాన్ అందుకు అంగీకరించ లేదు. పైగా ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌ను కూడా దాటుకుని దాడులు చేయ గల్గడంతో ఇక రంగంలోకి దిగక తప్పదని అమెరికా భావించింది. ఈ పరిణామాలకు తోడు ఇరాన్‌లో కొన్ని వర్గాల నంచి ఖొమైనీ విధానాలపై వ్యతిరేకత ఉంది. ఇస్లామ్ ఛాందసవాదం మితిమీరడం ప్రజల్లో చాలామందికి రుచించడం లేదు. బహిరంగంగానే విమర్శలకు దిగుతున్నారు. వారిపై అధికారులు జులుం చేయడం పరిపాటిగా మారింది. అక్కడ ప్రజల్లో ఎంతో కొంత ఉన్న అశాంతిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని ఇజ్రాయెల్ భావిస్తోంది. ఖొమైనీని తప్పించడమే లక్ష్యంగా చేసుకుంది. ఆయన నివాసం సమీపంలో బాంబు దాడి చేయడం ద్వారా గట్టి సంకేతాన్ని పంపించింది. ఆ తర్వాతా ఖొమైనీ బంకర్లోకి వెళ్లారు. అయితే, ఆయన ఎక్కడ ఉన్నదీ తమకు కచ్చితమైన సమాచారం ఉందని, కావాలంటే దాడి చేయగలం కానీ, చేయదల్చుకో లేదని, ఖొమైనీ స్వచ్ఛందంగా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేయాలని ట్రంప్ సూచించారు. ట్రంప్ తాజా సూచనకు ప్రతిగా ఖొమైనీ యుద్ధం మొదలయింది అని బదులిచ్చారు. దీంతో పరిణామాలు ఎటు దారితీస్తాయో తెలియ కుండా ఉంది. తాము దాడులు చేయగానే ఖొమేని వ్యతిరేకులు పెద్దఎత్తున రంగం లోకి వస్తారని, అధికార మార్పిడికి ఆజ్యం పోయవచ్చని ఇజ్రాయెల్ భావించినట్లు కనిపిస్తోందని, దానికి భిన్నంగా పరిణామాలు ఉన్నట్లు పరిశీలకులు చెబుతున్నారు. ఖొమైనీతో విబేధాలు ఉన్నప్పటికి ఇజ్రాయెల్‌ను వారు శత్రువుగానే చూస్తున్నారని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో యుద్ధం ఎన్ని రోజులు సాగుతుందో, ఎలా ముగుస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్



# జానకిరామ.. రామాయణం 70

- ఊటుకూరు జానకి రామారావు



అతనికి కంఠం కానీ శిరస్సు కానీ లేవు, అతని ముఖం, అతని పొట్టలోనికి ఉండి, వక్షస్థలము మీదనే కనులు, నోరు, నాసిక అమరి ఉండి, పచ్చనిగుడ్లతో వింతగొలిపే కనురెప్పలతో, పెద్దగుహ వంటి నోటిలో కోరలు కలిగి ఉండి, ఆమడ పొడవున్న దీర్ఘమైన బాహువులతో మహా భయంకరంగా చూపరుల గుండెలు బెదిరి చెదిరిపోయేలా ఉన్నాడు.

వాడి నోటి నుండి వచ్చే ధ్వని పెద్ద ఉరుములాగా ఉంది. వాడు ఆ సమయంలో ఎలుగుబంట్లను, సింహాలను, ఏనుగులను భక్షిస్తూ కనపడ్డాడు వారిరువురికీ.

వాడి పొడవైన చేతులను అరణ్యంలోనికి పంపి వాటి సహాయంతో అన్ని రకాల పెద్దపెద్ద జంతువులను తనవైపుకు లాగుకొంటున్నాడు.

వాడి చేతులు రామలక్ష్మణులున్నవైపునకు రాసాగినవి. ఒకేసారి ఆ చేతులు వారిద్దరినీ చుట్టుముట్టినవి. ఒక చేయి ఇద్దరినీ కలిపి తీసుకొని బంధించి గట్టిగా పట్టుకొంది. ఆ చేయిని నెమ్మదిగా తనవైపుకు లాగుకుంటున్నాడు కబంధుడు.

ఆ హస్తాలనుండి తప్పించుకొనే మార్గంలేక అందులో చిక్కుకొనిపోయి వానిచేత లాగబడి, లొంగిపోయి రాక్షసుని వద్దకు చేర్చబడ్డారు రామలక్ష్మణులిద్దరూ.

ఆ స్థితిలో కూడా రాముడు నిబ్బరంగా ఉన్నాడు. కానీ లక్ష్మణుడు మాత్రం ధైర్యం కోల్పోయి వ్యధ చెంది, అన్నా నేనొక్కడినీ వీడికి వశమైపోయి ఆహారమైపోతాను, నీవు నన్ను వీని వశం చేసి ఏదోవిధంగా తప్పించుకో అని పలికాడు.

అధైర్యంతో లక్ష్మణుడు అన్నమాటలు విని, వీరుడా నీవు భయపడకు, నీ వంటివాడు ఇలా విషాదానికి గురి కావచ్చునా? అని ధైర్య వచనాలు చెప్పి ఉత్తేజితుడినిచేశాడు.

వీరి మాటలు వింటున్న కబంధుడు వారిరువురినీ మీరెవరు? ఎచటివారు? ఈ అడవిలో విల్లమ్ములూ, ఖడ్గాలు ధరించి తిరుగుతూ నాకు ఆహారమైపోయినారు?

ఎవరు మీరు? అని అడిగాడు.

అవి కబంధ హస్తాలు!

ఒక్కసారి వాటిలో చిక్కితే ఇక అంతే సంగతులు.

అలాంటి కబంధుడి హస్తాలలో చిక్కి నిట్టూర్పులు విడుస్తూ,

లక్ష్మణా! చూడు విధి ఎంత చిత్రమైనదో!

ఒక కష్టం మీద మరియొక కష్టం వచ్చిపడుతుంది, సీత లభించకపోగా మన ప్రాణాలే పోయే పరిస్థితి దాపురించింది మనకు.

కాలం చాలా బలమైంది సుమా! మహాశూరులూ, వీరాధి వీరులు, బలవంతులు, వివిధ శస్త్రాస్త్ర నైపుణ్యం కలవారందరూ కూడా కాలం దాపురించగానే ఇసుకతో కట్టిన అడ్డకట్టల వలే కూలిపోవలసిందే! అని పలుకుతూ శ్రీరాముడు తన మనస్సులో అప్పటికప్పుడు ఒక స్థిర నిర్ణయం తీసుకొన్నాడు.

ఏమి మాటలాడుకొంటున్నారు మీరు, నాకు చాలా ఆకలిగా ఉంది, నా చేతిలో చిక్కిన మీరు నోటిదాకా రాకుండా ఎలా ఉండగలరు? ఇదుగో ఇప్పుడే మిమ్ములను భక్షించివేస్తాను అని హుంకరించాడు కబంధుడు.

రాముడి మనస్సులో చటుక్కున ఒక ఆలోచన వచ్చింది, ఆ రాక్షసుడి బలం ఎక్కడ ఉందో ఆయనకు వెంటనే స్ఫురించింది. ఆలోచన వచ్చినదే తడవు, లక్ష్మణా వీడి బలమంతా వీడి బాహువులలోనే ఉంది, వెంటనే వీడి బాహువులను నరికివేద్దామని చెపుతూ చెపుతూనే ఇరువురూ కూడబలుక్కొని క్షణమాలస్యం చేయకుండా వాడి బాహువులను భుజాల దగ్గర వరకు నరికివేశారు.

రక్తప్రవాహంలో శరీరం తడిసి ముద్ద అయిపోయి దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూ కబంధుడు, ఖండించబడిన తన బాహువులను చూసుకుంటూ వారిరువురినీ చూస్తూ మీరెవరు? అని దీనంగా ప్రశ్నించాడు.

అప్పుడు వాడిని చూసి లక్ష్మణుడు, ఈయన ఇక్ష్వాకు కులతిలకుడు శ్రీరాముడు, ఈయన భార్యనెవరో రాక్షసుడు అపహరించగా ఆమెను వెదుకుతూ ఇచ్చటకు వచ్చాము.

మరి నీవెవరవు మొండెము, చేతులు మాత్రమే కలిగి ఈ అరణ్యంలో దొర్లుతున్నావు? అని ప్రశ్నించాడు లక్ష్మణుడు.

ఆ మాటలు విన్న కబంధుడికి ఇంద్రుడు పూర్వం పలికిన పలుకులు గుర్తుకు రాసాగాయి.

మహానుభావా! నీవు రాముడవేనని నాకు అర్థమయ్యింది. నేను దనువు కుమారుడను, పూర్వం నేను యవ్వన గర్వంతో మదించి చేసిన పనులకు నాకీ రూపం ప్రాప్తించింది.

ఈ రూపంతో నేను స్థూలశిరస్కుడు అనే మహర్షిని భయపెడదామని ప్రయత్నించి, ఆయన శాపానికి గురి అయినాను. ఇంద్రుడి మీదకు యుద్ధానికి పోగా ఆయన కోపించి వజ్రాయుధం దెబ్బతో నా శరీరానికి ఈ స్థితి కల్పించాడు.

నన్ను కరుణించమని ఆయనను ప్రార్థించగా, ఎప్పుడైతే నా బాహువులలో రాముడు చిక్కి వాటిని ఖండిస్తాడో అప్పుడే నాకు ముని శాప విమోచనం, ఈ రూపం నుండి విముక్తికలిగి మరల స్వర్గ ప్రవేశానికి అర్హత లభిస్తుందని అనుగ్రహించాడు.

అప్పటినుండి నా చేతులకు అందినంత మేర ఏ వస్తువునూ, జీవినీ విడిచిపెట్టకుండా దగ్గరకు లాగుకునేవాడిని, నీ కోసమే అనుక్షణం ఎదురుచూసేవాడిని, ప్రతిక్షణం నీవే నా చేతిలో చిక్కినట్లుగా భావించేవాడిని, ఇన్నాళ్ళకు నా నిరీక్షణ ఫలించింది రామా! అని తన కథ తెలిపాడు కబంధుడు.

రామా నా శరీరానికి దహన సంస్కారాలు సూర్యాస్తమయం లోపుగా చెయ్యండి, అప్పుడు నాకు నా దివ్యరూపం తిరిగి లభిస్తుంది. అప్పుడు మాత్రమే నేను మీకు సహాయ పడగలను... అంతవరకు నాకు ఏ విషయం తెలియదు.

అతని మాటలు విన్న రామలక్ష్మణులు ఏనుగుల చేత విరవబడిన కట్టెలు ఎండినవి సేకరించి, ఒక పెద్ద గొయ్యి తీసి అందులో వేసి వాటిపై కబంధుడి శరీరాన్నుంచి దహనం చేశారు.

ఆ చితి నుండి మహాబలవంతుడైన కబంధుడు దివ్యమైన వస్త్రాలతో, ఆభరణాలతో ప్రకాశిస్తూ పొగలేని అగ్నివలె పైకి లేచాడు.

దివ్యవిమానంలో ఆకసమున నిల్చి రామా! ప్రస్తుతం నీ దశ చెడ్డది. అదేవిధమైన చెడుదశలో ఉండి బాధపడుతున్న ఒక మహా బలవంతుడైన వానితో నీవు స్నేహం చేసిన కానీ, నీకు మేలు జరగదు. అటువంటి మిత్రుడొకరిని నీవు ప్రస్తుతం సంపాదించ వలసి ఉంది.

మానవుడు లోకంలో కార్యాలు సాధించేందుకు సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైదీభావము, సమాశ్రయము అను ఈ ఆరు ఉపాయములను అవలంభించవలెను.

ప్రస్తుతం మీరు దుర్దశా ఫలాలు అనుభవిస్తున్నారు, అందుకే నీకు భార్యా వియోగం కలిగింది.

రామా, సుగ్రీవుడు అనే వానరుడు ఒకడున్నాడు...

ఋక్షరజస్సు అనే వానరుడి భార్యకు సూర్యదేవుడి అనుగ్రహం వలన పుట్టిన వాడీ సుగ్రీవుడు.

సూర్యకిరణాలు ప్రసరించినట్లు అతని దృష్టి పుడమి నాలుగు దిక్కులా ప్రసరిస్తుంది.

ఆయన ఋష్యమూకము అనే పర్వతం మీద నలుగురు వానరులతో కలిసి నివసిస్తున్నాడు.

అతని అన్న అయిన వాలి అతనిమీద కోపించి రాజ్యం నుండి వెడలగొట్టినాడు.

ఆయన చాలా గొప్ప పరాక్రమం, తేజస్సు, సాటిలేని కాంతి కలిగినవాడు. సత్యసంధుడు, వినయవంతుడు, ధైర్యవంతుడు, బుద్ధిశాలి.

ఇతను వానరుడే కదా! అని నీవు సుగ్రీవుని అవమానించరాదు, ఆయన కృతజ్ఞుడు, స్వేచ్ఛానుసారం రూపం ధరించగల సమర్థుడు. అతనికిప్పుడు మీ అవసరముంది.

అతని కార్యమొకటి నెరవేర్చవలసి ఉంది.

ఇంకొక్కమాట!

అతని కార్యం నేరవేరిననూ నేరవేరకపోయిననూ అతడు నీ పని చేయగలడు. సీతాదేవిని రావణుడు ఎక్కడ దాచి ఉంచినా కనుగొనగలడు.

రామా నీవు శీఘ్రమే ఇక్కడనుండి బయలుదేరి సుగ్రీవుని వద్దకు వెళ్లి అగ్నిసాక్షిగా ఆయనతో స్నేహం చేసికొనుము.

రామా! సుగ్రీవునకు నరమాంసభక్షకులైన రాక్షసుల స్థావరాలన్నియు తెలియును. నదులు, పర్వతాలు, సముద్రాలు, దుర్గములు అన్ని ప్రదేశాలు తన అనుచరుల చేత వెదికించి సీతాదేవి జాడ కనుగొనగలడు.

రామా ముందుగా ఇక్కడనుండి పడమర దిక్కుగా ప్రయాణం సాగించండి. ఆ మార్గంలోని అరణ్యం నందు ఎక్కడ చూసినా పుష్పించి ఫలాలతో నిండి ఉన్న వివిధములైన వృక్షజాతులతో దట్టముగా మార్గములల్లుకొని ఉండును.

.. (సశేషం)

## గాంధేయవాది

# 'రావిప్రోలు'.. ఇక లేరు



ప్రముఖ గాంధేయవాది, నెల్లూరీయుడు.. ఆ తర్వాత విశాఖ పట్నంలో స్థిరపడిన డా. రావిప్రోలు సుబ్రహ్మణ్యం (81) ఇక లేరు. అస్వస్థతో ఆయన ఈనెల 17న మంగళవారం నాడు విశాఖలో నిద్రలోనే కన్నుమూశారు.

ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేటలోని పినాకిని గాంధీ ఆశ్రమంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉండేది. గాంధేయవాదాన్ని ఆయన ప్రచారం చేసేవారు. తన 78 ఏళ్ళ వయసులో కూడా ఆయనెంతో పట్టుదలతో 'పర్సప్షన్ ఆఫ్ స్టూడెంట్ యూత్ ఆన్ మహాత్మాగాంధీ-ఏ స్టడీ ఇన్ ఆంధ్ర యూనివర్సిటీ' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తిచేసి, గాంధీజీ పట్ల తనకున్న శ్రద్ధాభక్తులు చాటుకున్నారు. అంతేకాదు, ఏటా గాంధీ జయంతి రోజున పల్లిపాడులో జరిగే కార్యక్రమాలకు ఆయన విశాఖ నుంచి వచ్చేవారు. గాంధీ ఆశ్రమానికి సభ్యునిగాను, ఆహ్వాన కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. ఎంతోమంది గాంధేయవాదులను ఆశ్రమానికి తీసుకువచ్చి, చరిత్రాత్మకమైన ఆ ఆశ్రమాన్ని గురించిన వివరాలు తెలియజేసేవారు. గాంధీజీ ఆశయాలను వివరించే కవితా సంకలనాన్ని కూడా ఆయన ముద్రించారు.

అంతేకాదు, ప్రముఖ సినీ నేపథ్యగాయకులు.. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఆయన బాల్యమిత్రులు కూడా. రావిప్రోలు మరణం బాధాకరమంటూ విశాఖపట్నంలోని గాంధీ సెంటర్ సభ్యులు తమ విచారం వ్యక్తం చేశారు. అదేవిధంగా, నెల్లూరుజిల్లాలోని పినాకిని గాంధీ ఆశ్రమం కమిటీ కన్వీనర్ గణేశం కల్పనమ్మ, కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి తదితరులు రావిప్రోలు మృతికి బాధపడుతూ, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



## వైభవోపేతంగా..

# గురువాయూరప్పన్ బ్రహ్మోత్సవాలు

నెల్లూరు వేదాయపాలెంలో ఉన్న శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ గురువాయూర్ మహావిష్ణు స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీవారు విలేకర్లతో మాట్లాడుతూ, ఈనెల 22వ తేదీ ఆదివారం వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం, ఊంజల్ సేవ కార్యక్రమాలు జరుగుతాయని, జూన్ 22 ఆదివారం ఉదయం స్నపన తిరుమంజనం, చక్రస్నానం, హయగ్రీవహోమం, సాయంత్రం ద్వాదశ ఆరాధన, మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, ధ్వజావరోహణం అనంతరం పుష్పయాగం నిర్వహిస్తామన్నారు. భద్రాచలం సీతారామ స్వామి దేవస్థానం స్థానాచార్యులు ఇళ్ళవల్లి కొమాండూరు స్థలసాయి స్వామివారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

ఆలయ కమిటీ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, బి శ్రీకాంత్‌రెడ్డి, పి.టి జగన్నాథం, కత్తి మోహన్‌రావు, రమణయ్య, కేజీ శంకరన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన జడ్పీ సీఇఓ



జిల్లా ప్రజా పరిషత్ సీఇఓగా మోహన్‌రావు ఇటీవల నెల్లూరు జడ్పీ కార్యాలయంలో పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మని ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# మాట తప్పిన టీడీపీ

## - రామ్‌కుమార్‌రెడ్డి విమర్శ



ఎటువంటి షరతులు నిబంధనలు లేకుండా ఎంతమంది పిల్లలు చదువుతున్నా, వారందరికీ రూ.15000 వంతున తల్లికి వందనం పథకం ద్వారా అందిస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు ఆ మాట తప్పారని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. వైకాపా పెట్టినవిధంగా, ఎటువంటి షరతులు లేకుండా 'తల్లికి వందనం' అమలు చేస్తామన్న కూటమి ప్రభుత్వం తాజాగా ఆ పథకానికి 300 యూనిట్లకు మించి కరెంటు వాడకం, పది ఎకరాల మెట్ట భూమి, సొంత కారు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు వంటి నిబంధనలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ఆయన వైకాపా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. వైకాపాకి కార్యకర్తలే బలమన్నారు. పార్టీ శ్రేణులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# మా సమస్యలు తీర్చండి...



## ఎమ్మెల్యేను కోరిన మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచాలని, 2018లో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక ఒప్పందంలోని సమాన పనికి సమాన వేతనం, గత 17 రోజులు సమ్మెకాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా పెంపు తదితర హామీలను నెరవేర్చాలని మునిసిపల్ కార్మికులు కోరారు. ఈ నెల 16వ తేదీ గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్‌కుమార్ నివాసం వద్ద ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి ధారా కోటేశ్వరరావు ఆమేరకు సమ్మె నోటీసు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, కమిటీ సభ్యులు జి.మణి, యన్.వెంకటరమణ, ఆర్.ఆనంద్, పి.రాజ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యానికేతన్‌లో యోగా దశాబ్ది ఉత్సవాలు



చిల్లకూరులోని విద్యానికేతన్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న యోగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యురాలు శశికళ మాట్లాడుతూ... శరీరానికి యోగా ఎంత అవసరమో, ధ్యానం కూడా అంత అవసరమన్నారు. ధ్యానం ద్వారా భగవత్ సాక్షాత్కారం పొందవచ్చునని, యోగా వల్ల సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని సూచించారు. ట్రైనర్ నరేష్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రిసెప్టర్ రజిని జైన్, రాజేంద్రకుమార్, మురళీకృష్ణారెడ్డి, లక్ష్మి, జాఫర్ అలీ, రజినీకాంత్, బాబురావు, అనసూయమ్మ, సంగీతమ్మ, బన్నీ పాల్గొన్నారు.



# పోటుపాలెంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ గూడూరు రూరల్ మండలం పోటుపాలెం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఏడవ అదనపు జిల్లా జడ్జి కె.వెంకట నాగపవన్, సీనియర్ సివిల్ జడ్జి రాజేష్‌లు మాట్లాడుతూ వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యం తగదంటూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో గూడూరు రూరల్ ఎస్సై ఎం.మనోజ్‌కుమార్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు జేవీవీ కూరగాయలు



గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఇటీవల ప్రొస్పరో స్కూల్ కరస్పాండెంట్ దశరథరామిరెడ్డి దాతృత్వంలో దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రతినెల మూడవ ఆదివారం కూరగాయలు, గుడ్లను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని, ఈ కార్యక్రమానికి దాతృత్వం వహించిన దశరథరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నాగరాజు, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష తులసీ పూజ



గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 15వ తేదీ ఉదయం లక్ష తులసీ పూజ, పుష్పయాగోత్సవం నిర్వహించారు. రాత్రి ద్వాదశారాధనం, ఏకాంత సేవను వేద పండితులు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా పలువురు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఛైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, తలమంచి శిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం

# రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్యామ్‌యాదవ్



జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరుకు చెందిన డాక్టర్ బండి శ్యాం సుందర్‌రావు(మయూరి శ్యామ్ యాదవ్)ను నియమించారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేసేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజయాదవ్, రాష్ట్ర నేతలు రాయి రమణయ్య, డాక్టర్ గుండాల సురేంద్ర, రజని, పద్మమ్మ, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'నీట్'లో సత్తా చాటిన.. 'డా.కిషోర్స్ రత్నం' విద్యార్థులు




ఇటీవల విడుదలైన 'నీట్' ఫలితాల్లో నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ కళాశాలకు చెందిన సి.జాహ్నవి (588 మార్కులు) 99.88 పర్సంటైల్‌తో జాతీయస్థాయిలో జనరల్ కేటగిరీలో 2505 ర్యాంకు, కేటగిరీలో 880వ ర్యాంకు సాధించడం విశేషం. అదేవిధంగా, సిహెచ్ లయవర్షిత ఆలిండియాలో 99.65 పర్సంటైల్‌తో, జనరల్ కేటగిరీలో 7462 ర్యాంకు, కేటగిరీలో 3642 ర్యాంకు సాధించింది. కె.ప్రజ్ఞశ్రీ 99.61, డి.సిరి 97.86, సిహెచ్ శేషాజానికి శ్రీరామ్ 95.15, ఎన్.తనూజ 94.59, వై.చరణ్‌కుమార్‌రెడ్డి 94.52, కె.సుశ్రిత 94.44, బి.ప్రణీత 93.78, ఇ.లీలా స్మైలీ 92.21, డి.హర్షనందిని 91.21, కె.దేవవల్లి 86.76 పర్సంటైల్‌తో అన్ని కేటగిరీల్లోనూ ఎంబీబీఎస్ సీట్లను సాధించారని, ప్రతి ముగ్గురు విద్యార్థుల్లో ఒకరికి ఆ అవకాశం లభించడం సంతోషంగా ఉందని కళాశాల యాజమాన్యం వారు తెలిపారు. ఈ విజయం పటిష్టమైన ప్రణాళిక, విశిష్టమైన విద్యాబోధన, నిపుణులైన అధ్యాపక బృందం నిరంతర కృషితో లభించిందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, రోషిణి, ఈశ్వర్‌లు శుభాకాంక్షలు తెలిపారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ, విద్యాప్రదాత కెవి రత్నం ఆశీస్సులు, డా.కృష్ణకిషోర్ ప్రత్యేక పర్యవేక్షణ, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషితో ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో నీట్ అకడమిక్ హెడ్ రఘుపతినాయుడు, అకడమిక్ అడ్వయిజర్ నరసయ్యనాయుడు, ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీకి.. రెడ్ క్రాస్ పురస్కారం




శ్రీసిటీ ఇటీవల నిర్వహించిన రక్తదాన శిబిరం రాష్ట్రంలో అత్యుత్తమ రక్తదాన శిబిరాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. 2025-ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వారిచే ఉత్తమ పురస్కారం అందుకుంది. గుంటూరులోని భారతీయ విద్యా భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ అవార్డును ప్రదానం చేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్, ఇసుజు మోటార్స్ ఇండియా, యాక్సెలెంట్ ఫార్మా సైన్స్ ప్రతినిధులు అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురికి పురస్కారాలు పంపిణీ చేయగా, 2023-24 సంవత్సరానికి 'ఒకే శిబిరంలో సేకరించిన అత్యధిక రక్త యూనిట్లు' విభాగంలో శ్రీసిటీ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇది సామాజిక బాధ్యత మరియు ప్రజారోగ్యం పట్ల శ్రీసిటీ నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. రెడ్ క్రాస్ అవార్డు పట్ల సంతోషం వ్యక్తం చేసిన శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, ఈ గుర్తింపు పారిశ్రామిక అభివృద్ధి సామాజిక నిబద్ధతతో కలిసి నడవాలనే తమ నమ్మకాన్ని దృఢపరుస్తుందన్నారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే లక్ష్యంతో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో సహకరించిన తమ ఉద్యోగులు, పరిశ్రమల కార్మికులందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా..రక్తదాతల దినోత్సవం



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ-జిల్లా శాఖ ఆధ్వర్యంలో, రెడ్ క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయ కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఈనెల 15న ప్రపంచ రక్తదాతల దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్ కుమార్ జైన్, బ్లడ్ సెంటర్ అడ్వైజర్ మరియు మేనేజింగ్ కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి, రక్తనిధి కన్వీనర్ సి.హెచ్ అజయ్‌బాబు పాల్గొని రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రి డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రక్తదానం ఆవశ్యకత గురించి తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, మాజీ ఛైర్మెన్ డా. ఏ.వి.సుబ్రహ్మణ్యం వివరించారు. రక్తదాతల సేవలను అందరూ కొనియాడారు. అనంతరం, ఎక్కువ సార్లు రక్తదానం చేసిన పలువురు రక్తదాతలను ఘనంగా సన్మానించారు.

## ప్రజలకు
# అండగా ఉంటాం
### సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దంపతుల హామీ



సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు తామున్నామని, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనయుడు, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి, శృతిరెడ్డి దంపతులు హామీ ఇచ్చారు.

ఇటీవల వారు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకుని ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తెచ్చి, ఆ ఇబ్బందులను తీర్చేందుకు కృషిచేస్తున్నారు. వెంకటాచలం మండలంలోని ఎగువమిట్టలో ఇంటింటికీ వెళ్ళి ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు వారిని సాదరంగా స్వాగతించి తమ కష్టసుఖాలను వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రాజగోపాలరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

## రాహుల్‌గాంధీ
# పుట్టినరోజు వేడుకలు



కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ 55వ పుట్టినరోజు వేడుకలను ఈనెల 19న నెల్లూరులోని కాంగ్రెస్ నాయకులు సంబరంగా జరుపుకున్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఏటూరు శ్రీనివాసరెడ్డి, బాలసుధాకర్ తదితరులు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం, సమానత్వం, దేశ భద్రత, మహిళా సాధికారత, యువత అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని, రాహుల్‌గాంధీ దేశ ప్రజల గొంతుగా నిలుస్తూ, నిరంతరం ప్రజల కోసం పోరాటం చేస్తూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. భారతదేశ ప్రజాస్వామ్యానికి నిజమైన గొప్ప నాయకుడిగా, యువతకు ప్రేరణగా నిలుస్తున్న రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు అంటూ కేకు కట్ చేసి అందరికీ పంచారు. రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. నాయకులు నెట్రాంబాక మోహన్‌రెడ్డి, పప్పర్తి గణేష్ బాబు,హుస్సేన్‌బాషా, సత్తెనపల్లి బాలయ్య, బిట్ట కిషోర్, రెహ్మాన్, నసీమా, రాజేష్‌రెడ్డి, మంజుల, ఇర్ఫాన్, కరుణాకర్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి నారాయణకు..ప్రశాంతమ్మ శుభాకాంక్షలు

మంత్రి నారాయణ జన్మదినోత్సవం సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరుఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరులు కోటారెడ్డి ఈనెల 15న నెల్లూరులోని మంత్రి నివాసానికి వెళ్ళి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జర్మనీలో నారాయణ జన్మదినోత్సవం



రాష్ట్ర పురపాలక మంత్రి డా. పొంగూరు నారాయణ పుట్టిన రోజు వేడుకలు ఈనెల 15న జర్మనీలోని హాంబర్గ్ నగరంలో ఎన్ఆర్ఐ టీడీపీ-హాంబర్గ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు శశిధర్ ఏమిరెడ్డి మరియు డా. శివ శంకర్ లింగం సారధ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మంత్రి నారాయణ సేవలను మరియు రాజధాని అమరావతి నగర నిర్మాణంలో ఆయన కీలక పాత్రను గుర్తు చేసుకున్నారు. హాంబర్గ్ టీడీపీ టీం, విక్రమ్ తల్లపనేని, దినేష్ పాకలపాటి, కిషోర్ దాసుగారి, అఖిల్ ప్రసన్న, శ్రీకాంత్ గోళ్ళ, భరత్ శీలంనేని, ఉజ్వల్ మారెడ్డి, హాంబర్గ్ తెలుగు కమ్యూనిటీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ వడ్డాది, సభ్యులు అంకారావు మరియు అనేక తెలుగు వారు కుటుంబాలవారు పాల్గొన్నారు.

# తల్లికి వందనం..సంతోషకరం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం ఎంతోమంది పేద విద్యార్థులకు ఒక వరమని నెల్లూరు మునిసిపాలిటీ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు నగరం 16వ డివిజన్ గుర్రాలమడుగు ప్రాంతానికి చెందిన మహిళలతో కలసి ఈనెల17న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యామంత్రి నారా లోకేష్, మంత్రి నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సాయి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# రాజరాజేశ్వరిదేవి ఆలయంలో.. యోగా



నెల్లూరు దర్గామిట్ట లోని శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 17న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఇఓ పి.జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు, సిబ్బంది, భక్తులు యోగాసనాలు వేశారు. యోగాసనాల సాధన వల్ల మానసిక ఒత్తిడి దూరం అవుతుందని ఆయన తెలిపారు. ప్రధాని, ముఖ్యమంత్రి సూచనలతో ప్రతి ఆదివారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.



## చెస్ క్రీడాకారులకు..
# నేదురుమల్లి అభినందన

నెల్లూరులో ఇటీవల జరిగిన జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌లో వెంకటగిరి వాసి కలవ దమరేష్ మొదటి స్థానం సాధించాడు. ఈ సందర్భంగా వెంకటగిరి వైకాపా నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెంకటగిరి విజయ్ చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులను అభినందించారు. అందులో మొదటి స్థానం సాధించిన కె.దమరేష్, అండర్-12 విభాగంలో 5వ స్థానంలో నిలిచిన నైనిక, అండర్-16 విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన కీర్తనలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ప్రతిభతో రాణించాలని ఆకాంక్షించారు. విజయ్ చెస్ అకాడమీ ఛైర్మెన్ నర్రా విజయ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## సీనియర్ పాత్రికేయుడు..
# ఓలేటి నాగేశ్వరరావు కన్నుమూత



కావలి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, 'వార్త' దిన పత్రికలో పాత్రికేయునిగా పని చేస్తున్న ఓలేటి నాగేశ్వరరావు కన్నుమూశారు. అనారోగ్యంతో ఆయన నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో చేరి చికిత్స చేసుకుంటూ ఈనెల 16వ తేదీ సోమవారం నాడు తుదిశ్వాస విడిచారు. జిల్లా పత్రికారంగంలో ఓలేటి అందరికీ సుపరిచితులే. పలు పత్రికల్లో పనిచేస్తూ, దాదాపు మూడు దశాబ్దాలకు పైగానే ఆయన పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. సుదీర్ఘకాలం 'వార్త'లోనే ఉన్నారు. ఏపీయుడబ్ల్యుజె జిల్లా శాఖ గౌరవాధ్యక్షులుగా కూడా ఉండేవారు. ఆయన మరణం పట్ల కావలిలోని అనేకమంది నాయకులు, ప్రముఖులు జర్నలిస్టులు విచారం ప్రకటించారు. ఏపీయుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి అనుమల జయప్రకాష్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు రమేష్, ప్రింట్‌మీడియా కోశాధికారి గద్దం హనోక్ తదితరులు ఓలేటి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పాత్రికేయునిగా కావలికి ఎంతో కాలం నుంచి సేవలందిస్తున్న ఓలేటి లేకపోవడం బాధాకరం. ఆయన మృతికి చింతిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలువుతోంది..'లాయర్'!

# గెలుపు

మనం అనుకుంటాం గాని
వాడిదే తప్పని
అది ఆత్మవంచనే కదా
మన బలహీనమైన క్షణంలో కదా
వాడు బలమైన సంకెళ్ళు వేసేది
మన బలహీనత
బ్యాలెన్సు తప్పిన తీగపై మనిషిలా వ్రేలాడితే
అది వాడికి ఆయుధంగా మిగలడాన్ని
కొట్టిపారేయలేం కదా
మనం ఐసుగడ్డలా బిగుసుకుపోతే
వాడు మాత్రం ఏం చేయగలడు
అలాకాదే ఆరిందలా కళ్ళు తెరచి
గుడ్లగూబై అవకాశాన్ని చేజిక్కించుకోవాలనే
ఆశనే కదా వాడు పైలెట్‌లా ఒడిసి
పట్టుకొనేది.
నిజానికి దూరం దూరం జరిగే
ఆటలో అభ్యర్థులమైతే
గెలుపు బావుటా
మనదేగా మిత్రమా!



**చిన్ని నారాయణరావు**
9440202942

## కక్ష సాధింపులు కాదు..
# ప్రజల సంక్షేమమే ముఖ్యం

**- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



తమ ప్రభుత్వ పాలనలో కక్ష సాధింపులకు తావు లేదని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తమకు ముఖ్యమని మాజీమంత్రి, తెలుగుదేశం నాయకుడు.. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన మనుబోలు మండలంలోని బండేపల్లి గ్రామంలో 'తల్లికి వందనం' పథకం ప్రారంభం సందర్భంగా చిన్నారులతో కేకు కట్‌చేయించి అందరికీ పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం గత విధ్వంసం నుంచి తేరుకొని వికాసం వైపు నడుస్తోందని, గత వైకాపా ప్రభుత్వ హయాంలో గాడితప్పిన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహించనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా గుంతలమయంగా ఉన్న రోడ్లను మరమ్మతులు చేయించామని, నీటిపారుదల కాలువలను బాగుచేయించామని, మత్స్యకారులకు వేట విరామ భృతిని పెంచామని..ఇలా ఎన్నో హామీలను ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. తమ నియోజకవర్గమైన సర్వేపల్లి నియోజకవర్గంలో ఈ ఒక్క ఏడాదిలోనే రూ.121 కోట్లతో 685 అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన వివరించారు. ఏడాది క్రితం సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు తనకు అండగా నిలిచి ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించారని, వారి రుణం తీర్చుకుంటానని, సర్వేపల్లిని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. సోమిరెడ్డి తనయుడు రాజగోపాల్‌రెడ్డి, కోడలు శృతిరెడ్డి, టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# అర్హులకు ఇళ్ళస్థలాలివ్వండి

## అధికారులకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆదేశం



అర్హులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పేదోళ్ళ సొంతింటి కలను సాకారం చేయడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇటీవల ఆమె నెల్లూరులోని తమ నివాసంలో గృహనిర్మాణ, రెవిన్యూ అధికారులతో సమావేశమై, అధికారులు పరస్పరం సమన్వయంతో వ్యవహరించి ఇళ్ల కేటాయింపు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన కాలనీలలో మిగులు స్థలాలను గుర్తించాలని కూడా చెప్పారు. కోవూరు నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు కావాలని దాదాపు 1600 మంది దరఖాస్తులు చేసుకొని ఉన్నారన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములతో పాటు, గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో మిగిలి ఉన్న ప్లాట్లు గుర్తించి, పేదలకు న్యాయం చేసే దిశగా చొరవ తీసుకోవాలన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను అరికట్టాలని ఆమె అధికారులకు సూచించారు. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తెచ్చి పేదల ఇళ్లస్థలాల కోసం భూసేకరణ చేస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యాక ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా పేదలకు ఉచితంగా ఇళ్లు కట్టిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్, డిఇ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన తహశీల్దార్లు పాల్గొన్నారు.

# వీఆర్ఏల సమస్యలు తీర్చాలి

**- తహశీల్దార్‌కి వినతి**



గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు తీర్చాలంటూ మండల కేంద్రమైన సంగంలో వీఆర్ఏలు తహశీల్దార్ సోమ్లానాయక్‌కు ఈనెల 16న వినతి పత్రం అందజేశారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు. అర్హత ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకులకు వీఆర్ఓలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, వీఆర్ఓలకు పే-స్కేల్ అమలుచేయాలని కోరారు. వీఆర్ఏల సంఘం నాయకులు లక్ష్మయ్య, అమీర్, రాజేష్, శైలజ, మురళి పాల్గొన్నారు.

## టూకీగా...



### ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థికసాయం

ఆత్మకూరుకు ఎస్‌సీఇ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థిని చదువుకు డా.విజయం దొరసానమ్మ స్మారక ట్రస్టు ఛైర్మెన్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ తమ ట్రస్ట్ తరపున ఇటీవల 20వేల రూపాయలను ఆర్థికసాయంగా ఆ విద్యార్థిని తండ్రి అశోక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ కుమార్, టి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### చలంచర్లలో కోడిపందెంరాయుళ్ళ అరెస్ట్

కావలి మండలం చలంచర్ల గ్రామం అటవీప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న కోడిపందాల స్థావరంపై పోలీసులు ఈనెల 15న దాడిచేసి 12మంది పందెం రాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 9 కోళ్ళు, రూ.12,090లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సీఐ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడులు చేశారు.

### సైదాపురంలో మధ్యాహ్న భోజనం పరిశీలన

మండల కేంద్రమైన సైదాపురంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును ఈనెల 16న ఆ పాఠశాల విద్యాకమిటీ ఛైర్మెన్ ఎం.నీరజ పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని సిబ్బందికి చెప్పారు. పాఠశాలలో తాగునీటిని అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేయాలన్నారు.

### పెనుబర్తి పశువైద్యాధికారిగా..ప్రసాద్

రాపూరు మండలం పెనుబర్తి పశువైద్యాధికారిగా డాక్టర్ బి.ప్రసాద్ ఈనెల 16న బాధ్యతలు స్వీకరించారు. గతంలో కూడా ఆయన ఇక్కడ పనిచేసి మంచిపేరు తెచ్చుకుని ఉండడంతో, స్థానిక ప్రజలు ఆయన మళ్ళీ బదిలీపై ఇక్కడికి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గోపాలమిత్రలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### చేజర్లలో శ్రీ సీతారాముల ఉత్సవాలు

మండల కేంద్రమైన చేజర్లలో పడమటివీధిలో ఉన్న శ్రీ సీతారాముల ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 16న స్వామివారిని-అమ్మవారిని అశ్వ వాహనంలో ఊరేగించారు. అనంతరం, శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### బురాన్‌పూర్‌లో మలేరియాపై అవగాహన

వెంకటాచలం మండలంలోని బురాన్‌పూర్‌లో ఈనెల 16న కసుమూరు వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక ఆధ్వర్యంలో మలేరియా వ్యాధి పట్ల అవగాహన కలిగించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఆ వ్యాధి వచ్చిందని అనుమానం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

### విడవలూరులో అంకమ్మతల్లికి విశేష పూజలు

మండల కేంద్రమైన విడవలూరులో వెలసివున్న గ్రామ దేవత అంకమ్మతల్లికి ఈనెల 16న విశేష పూజలు జరిగాయి. పూజారి కొర్ల గిరిస్వామి ఆధ్వర్యంలో, ఉభయకర్తల సహకారంతో ఈ కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారిని కన్నుల పండువగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు చేశారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### కోవూరులో రౌడీలకు కౌన్సిలింగ్

కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీలకు, కేడీలకు కోవూరు ఎస్ఐ రంగనాథగౌడ్ ఈనెల15న కౌన్సిలింగ్ ఇచ్చారు. బుద్ధి మార్చుకుని, అందరూ సత్ప్రవర్తనతో జీవించాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, మంచిగా ఉండకపోతే మీకే నష్టమని వారికి స్పష్టం చేశారు.

### చిలకలమర్రిలో పూరిల్లు అగ్నికి ఆహుతి

అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి గ్రామంలో ఇటీవల జి.పెంచలయ్యకి చెందిన పూరిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఇల్లు కాలిపోవడంతో సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు లబోదిబోమంటున్నాడు.

# చరిత్ర సృష్టించిన..చారిత్రాత్మక పాఠశాల

- **ఒక్కరోజులోనే రికార్డుస్థాయిలో 900 అడ్మిషన్లు**
- **విద్యార్థులు, తల్లితండ్రులతో విఆర్ హైస్కూల్ కిటకిట!**



*గత వైకాపా పాలనలో మూతవేయబడిన విఆర్ విద్యాసంస్థలకు ఇక మంచిరోజులు రావేమో అనుకుంటున్న నేపథ్యంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఆ పాఠశాలలోనే చదువుకున్న నారాయణ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కావడంతో విఆర్ హైస్కూల్‌కు మళ్ళీ మహర్దశ వచ్చింది. ఆ పాఠశాల చదువే తనకు ఇంత ఉన్నతస్థాయినిచ్చిందనే కృతజ్ఞతతో దాదాపు శిథిలావస్థకు చేరిన ఆ విద్యాలయాన్ని మంత్రి నారాయణ ఎంతో దీక్షతో ఆధునీకరించారు. దీంతో పాఠశాల అడ్మిషన్లు కూడా ప్రారంభం కావడం, ఒక్క రోజులోనే 900 అడ్మిషన్లతో విఆర్ హైస్కూల్ చరిత్ర సృష్టించడం విశేషం.*

వైకాపా హయాంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్థమైపోయింది. జిల్లాలోని పలు చరిత్రాత్మకమైన విద్యా సంస్థలు కూడా మూతపడ్డాయి. మళ్ళీ తెలుగుదేశం కూటమి పాలనా పగ్గాలు చేతపట్టి, యువనేత నారా లోకేష్‌బాబు విద్యామంత్రిగా పదవిని అధిష్టించడంతో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు బాగుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు నగర నడిబొడ్డున మూతవేయబడిన విఆర్ హైస్కూలును మంత్రి నారాయణ సర్వాంగసుందరంగా రూపుదిద్దడంతో విద్యార్థి లోకంలో సంతోషం వెల్లువెత్తుతోంది. నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయిలో డిజిటల్ విద్యను అందించేందుకు మంత్రి నారాయణ నేతృత్వంలో పూర్తిస్థాయి కృషి జరుగుతోంది.

బడులు తెరవడంతో, ఇక్కడ కూడా అడ్మిషన్లు ప్రారంభం కావడంతో వి ఆర్ హైస్కూల్ లో పండుగ వాతావరణం నెలకొంది. ఎన్నడూ లేని విధంగా తల్లిదండ్రుల కళ్ళల్లో అవధులు లేని ఆనందం కనిపించింది. అడ్మిషన్ల కోసం వచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థులతో విఆర్ హైస్కూల్ కిటకిటలాడింది. తమ బిడ్డల కోసం అత్యాధునిక సౌకర్యాలతో మంత్రి నారాయణ అద్భుతంగా నిర్మించిన విఆర్ పాఠశాలను చూసి ఇది కలా... నిజమా అని తల్లిదండ్రులు అవాక్కయ్యారు. మంత్రి నారాయణ స్వయంగా ఈ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించి పర్యవేక్షించడం మరో విశేషం. దీంతో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల తల్లితండ్రులు ఎంతో ఆనందించారు. మంత్రి నారాయణ, ఆయన సతీమణి రమాదేవి విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. ఇంత గొప్పగా విఆర్ హైస్కూలును రూపుదిద్దినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## వచ్చే ఏడాది ఇంటర్ - మంత్రి నారాయణ

వీఆర్ హైస్కూల్లో నర్సరీ నుంచి 9వ తరగతి వరకు ఉంటుందని..వచ్చే సంవత్సరం ఇంటర్మీడియట్ వరకు నిరుపేద బిడ్డలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించబోతున్నట్లు మంత్రి నారాయణ ఈ సందర్భంగా తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్. రవాణా సౌకర్యాలతో పూర్తి ఉచితంగా విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన అందజేస్తున్నామన్నారు. అంతేకాక, అన్ని రకాల క్రీడా పరికరాలతో క్రీడా మైదానం ఏర్పాటు చేశామని చెప్పారు. విఆర్ పాఠశాలను తిరిగి ప్రారంభిస్తామని తాము ఎన్నికల సమయంలో నెల్లూరు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోగలగడం తనకు సంతృప్తినిస్తోందన్నారు. వెయ్యి మందికి పైగా విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు కల్పిస్తున్నామన్నారు. ఈనెల 23న విఆర్ పాఠశాల ప్రారంభోత్సవం జరుగుతుందని వెల్లడించారు. అదేవిధంగా నెల్లూరు నగరంలోని 54 మున్సిపల్ పాఠశాలలను దాతల సహకారంతో ఇదే తరహాగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, నాయకులు రూప్‌కుమార్‌యాదవ్. వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి పాల్గొన్నారు.


## కలలో కూడా ఊహించలేదు

**- ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రశంస**



నెల్లూరు విఆర్ హైస్కూల్ ఇంత అద్భుతంగా తయారవుతుందని తాను కలలో కూడా ఊహించలేదని, మంత్రి నారాయణకే అది సాధ్యమైందని, ఇప్పుడు ఆ స్కూల్‌ను చూస్తే దిమ్మతిరిగిపోయేలా ఉందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. మంత్రి నారాయణ పుట్టినరోజు సందర్భంగా నారాయణను కలిసి శుభాకాంక్షలు చెప్పిన సోమిరెడ్డి, అనంతరం మంత్రితో కలిసి విఆర్ హైస్కూల్‌ని సందర్శించారు. తరగతి గదుల్లో ఫర్నిచర్, డిజిటల్ ఎక్విప్‌మెంట్, ప్లే గ్రౌండ్ చూసి సోమిరెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ స్కూల్ కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ఉందంటూ కితాబిచ్చారు. ఒక్క రోజులోనే 900 మందికి ఈ స్కూల్‌లో అడ్మిషన్లు జరగడం అభినందనీయమని కొనియాడారు.


ప్రథమ వర్ధంతి



జననం 1929

నిర్యాణం 2024

ప్రేమానురాగాలు పంచిన అమృతమూర్తిని స్మరించుకుంటూ...

శ్రీమతి కొండ్లపూడి శేషమ్మ గారు

పరిపూర్ణ జీవితం సాగించి, మాకు దూరమై
22-06-2025 నాటికి ఏడాది గడుస్తున్న సందర్భంగా
హైదరాబాదు, జూబ్లీహిల్స్, రోడ్ నెం.10 ఇంటి నెం.156 లోని
మా స్వగృహము నందు సంవత్సరీకం జరుగును.

కుమారుడు – కోడలు
కొండ్లపూడి నరసారెడ్డి
లక్ష్మి

మనుమడు – మనుమరాలు
సిద్ధారెడ్డి సిద్ధార్థరెడ్డి - సాయి సంయక్తరెడ్డి

మునిమనుమడు
సిద్ధారెడ్డి శివంరెడ్డి

కుమారుడు – కోడలు
కొండ్లపూడి సుధాకర్‌రెడ్డి
అనిత

మనుమలు – మనుమరాళ్ళు
కొండ్లపూడి సునిశ్చల్‌రెడ్డి - షికారెడ్డి
బోయ చరణ్ ప్రసాద్‌రెడ్డి - సునయనారెడ్డి

మునిమనుమరాళ్ళు
కొండ్లపూడి సాయి అక్షయ, సాయి ఆరాధ్య
బోయ ఇషిత, ఇషానా

కుమార్తె – అల్లుడు
సోమవరపు ఝాన్సీరెడ్డి
లేట్ సోమవరపు రవీంద్రారెడ్డి

మనుమలు – మనుమరాళ్ళు
వై.యస్.అనిల్‌రెడ్డి - మాలినిరెడ్డి
సోమవరపు బలరామ్‌రెడ్డి - చందనదీప్తి, IPS

మునిమనుమడు – మునిమనుమరాళ్ళు
వై.యస్.సాజీవ్, వై.యస్.శ్రేయ
సోమవరపు ఆర్యఅద్వైతా


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com